www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
పేజీలు : 08 | వెల : 5.00
ప్రతి అక్షరం జనం కోసం..

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 176 | శుక్రవారం 6 | డిసెంబర్ 2024

## మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం

ప్రధాని మోదీ సమక్షంలో ప్రమాణ స్వీకారం
డిప్యూటీలుగా షిండే, అజిత్ పవార్ ప్రమాణం



ముంబై, డిసెంబర్ 5 : ముంబైలోని ఆజాద్ మైదానంలో గురువారం జరిగిన భారీ కార్యక్రమంలో దేవేంద్ర ఫడ్నవీస్ మూడోసారి మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఫడ్నవీస్ కు ఇది మూడోసారి. ఆజాద్ మైదానంలో జరిగిన

మిగతా 2 లో



# ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

## నియోజకవర్గానికి 3,500 ఇళ్లు నిర్మిస్తాం

- ఐటీడీఏ పరిధిలో గిరిజనులకు ప్రత్యేక కోటా
- గతంలోని ఇందిరమ్మ ఇళ్ల రుణా లు మాఫీ
- కేసీఆర్ పెద్దరికాన్ని నిలుపుకొని ప్రతిపక్ష నేతగా సలహాలు ఇవ్వాలి
- చిన్న పిల్లల్లా వ్యవహరిస్తున్న కేటీ ఆర్, హరీశ్ రావు తీరు మార్చుకో వాలి
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కు కేసీఆర్ సహా ప్రతిపక్ష నేతలకు ఆహ్వానం
- ఇందిరమ్మ ఇళ్ల యాప్ ఆవిష్క రణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్: ప్రతి శాసనసభ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో తొలి ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రతి ఇంటికి రూ.5 లక్షలు ఇస్తున్నామని.. దేశంలో ఇంత మొత్తం కేటాయిస్తున్న రాష్ట్రం తెలంగాణేనని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ


మిగతా 2 లో

## కోటి మందిని కోటీశ్వరులను చేస్తాం

- అదానీ, అంబానీలతో ఆడబిడ్డలు పోటీ పడాలి
- ఎస్‌హెచ్‌జీ సభ్యులు కోటికి చేరాలి
- ఇందిరా మహిళా శక్తి బజార్.. ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- మహిళా సాధికారతలో తెలంగాణ ఓ నాంది: గవర్నర్ జిష్ణుదేవ్



02



04

## నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్ఎల్వీ-సీ59

ఇస్రో రాకెట్ ప్రయోగం సూపర్ సక్సెస్



04

## పోషకాహారంతో కూడిన భోజనాన్ని అందించాలి

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై పిటిషన్.. తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు



04

## ప్రయాణికులకు తీపికబురు చెప్పిన రైల్వే

జనరల్ బోగీలను పెంచనున్న సౌత్ సెంట్రల్ రైల్వే

## నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదాలు

### ప్రజలకు చట్టాలంటే భయం లేదు..

- ప్రజల సహకారం లేకుండా రోడ్డు ప్రమాదాలు తగ్గించలేం
- ప్రమాదాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి
- ప్రజల నిర్లక్ష్యం వల్ల బాధితుల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆవేదన



02

## అల్లు అర్జున్‌పై కేసు

ఆయన భద్రతా సిబ్బందితో పాటు సంధ్య థియేటర్ యాజమాన్యంపైనా!



04



- మహిళ మృతి నేపథ్యంలో..
- బీఎన్ఎస్‌లోని నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద నమోదు
- అల్లు అర్జున్ వస్తున్నట్టు యాజమాన్యం సమాచారం ఇవ్వలేదు: పోలీసులు
- నేరం రుజువైతే పదేళ్లదాకా జైలు!

## కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చి మాట్లాడాలి

- ఆనాడు రేవంత్ రెడ్డిని చిన్న కేసులో అరెస్ట్ చేశారు
- కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కక్షపూరిత రాజకీయాలు చేయదు
- మంత్రి కొండా సురేఖ ఆగ్రహం



03

# అరెస్టులు.. హైడ్రామా!

### ఉదయమే కౌశిక్ నివాసానికి హరీశ్.. అదుపులోకి తీసుకున్న పోలీసులు

- అనంతరం కౌశిక్ రెడ్డి, 20 మంది కార్యకర్తల అరెస్టు
- అరెస్టులు అక్రమం: కవిత
- హరీశ్ అరెస్టు నిరసనగా సిద్దిపేటలో రేవంత్ దిష్టిబొమ్మ దహనం
- నేడు నెక్లస్ రోడ్డులో నిరసనలు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని గురువారం బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఆయన అరెస్టుకు ముందు, తర్వాత హైడ్రామా నెలకొంది. కౌశిక్ రెడ్డి అరెస్టును అడ్డుకొనేందుకు కొండాపూర్‌లోని ఆయన నివాసానికి వచ్చిన మాజీ మంత్రి హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతలను వచ్చినవారిని వచ్చినట్లుగా పోలీసులు అరెస్టు చేశారు.



హైదరాబాద్, డిసెంబరు 5 : తన ఫోన్ ట్యాపింగ్‌కు గురవుతోందని.. ఇందుకు సీఎం రేవంత్, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి కారణమని ఫిర్యాదు చేసేందుకు బుధవారం కౌశిక్‌రెడ్డి బంజారాహిల్స్ ఠాణాకు చేరుకున్నారు. అదే సమయంలో సీఐ రాఘవేంద్ర తన వాహనంలో బయటకు వెళుతున్నారు. గమనించిన కౌశిక్‌రెడ్డి తన కారుతో సీఐ వాహనాన్ని అడ్డుకున్నాడు. తన ఫిర్యాదు స్వీకరించాలని

మిగతా 2 లో

## ఏడాదైనా ఎన్నికల హామీలను నెరవేర్చని కాంగ్రెస్

### ఆ పార్టీ మోసాలను ప్రజలకు చెప్పేందుకు త్వరలో హైదరాబాద్‌లో సభ: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబరు 5 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ఎన్నికల సందర్భంగా ఆ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కాలేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఏడాది కాలంగా అబద్ధపు ప్రచారాలతో



మిగతా 2 లో

## తప్పులు చేస్తే ఉపేక్షించం

- యూపీఎస్సీతో సమానంగా టీజీపీఎస్సీ పని చేస్తుంది
- నూతన టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం
- జీపీఎస్సీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బుర్రా
- 2030 ఏప్రిల్ 4 వరకు కొనసాగే అవకాశం



03

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

# ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు



మొదటి పేజీ తరువాయి

దేశంలో ఇళ్ల నిర్మాణం ద్వారా పేదలకు ఆత్మ గౌరవాన్ని ఇందిరా గాంధీ కల్పించారని కొనియాడారు.

ఆత్మగౌరవంతో బతకాలనుకుంటే సొంత ఇల్లు ఉండాలని, ఆ కల నెరవేరాలనే ఇందిరా గాంధీ ఇళ్లు నిర్మించి ఇచ్చారని సీఎం తెలిపారు. దేశంలో గుడి లేని ఊరు ఉండొచ్చేమో కానీ ఇందిరమ్మ కాలనీ లేని ఊరు ఈ దేశంలోనే లేదని చెప్పగలనని సీఎం అన్నారు. కూడు.. గూడు.. గుడ్డ... నినాదాన్ని ఇందిరా గాంధీ ఆచరణలోకి తీసుకువచ్చారన్నారు. సీలింగ్ యాక్ట్ ద్వారా గిరిజనులు, దళితులకు మిగులు భూముల పంపిణీ చేపట్టారని, ఇళ్ల నిర్మాణం చేపట్టారని సీఎం తెలిపారు. ఇందిరమ్మ హయాంలో ఇంటి నిర్మాణానికి రూ.10 వేలు కేటాయిస్తే.. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అది రూ.1.25 లక్షలకు చేరిందని... పెరిగిన ధరల ప్రకారం ఇప్పుడు తమ ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా.. గ్రీన్‌ఛానల్ ద్వారా లబ్ధిదారులకు రూ.5 లక్షలు అందజేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. తొలి ఏడాది సొంత స్థలం ఉన్నవారికి ఇళ్లు మంజూరు చేస్తామని, దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, పారిశుధ్య సిబ్బంది, దళితులు, గిరిజనులు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లకు ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు, ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో గిరిజనులకు ఇళ్లు కేటాయించారని, ఆ తర్వాత వారికి ఇళ్ల కేటాయింపు సక్రమంగా జరగలేదని సీఎం అన్నారు. తమ ప్రభుత్వం ఐటీడీఏల పరిధిలోని నియోజకవర్గాలు, ప్రాంతాల్లోని గిరిజనుల కోసం ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రత్యేక కోటా ఇస్తుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. నల్లమల్లలోని చెంచులు... ఆదిలాబాద్‌లోని గోండులు... భద్రాచలంలోని కోయలు.. ఎవరైతే తెలంగాణ మట్టి మనుషులో.. తెలంగాణ మూల పురుషులో వారికి ఇందిరమ్మ ఇళ్లను ప్రత్యేకంగా కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇంద్రవెల్లికి వెళ్లి తాను స్వయంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పట్టాలు అందజేసిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఈ నమూనానే పాటించాలని తాము సూచించడం లేదని, అదే సమయంలో తమకున్న స్థలంలో ప్రతి అంగుళాన్ని లబ్ధిదారులు వినియోగించుకునేలా ప్రతి మండల కేంద్రంలో మోడల్ హౌస్‌లు నిర్మిస్తామని.. లబ్ధిదారులు తమ అవగాహన కోసం వాటిని చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. లబ్ధిదారులు తమ స్థోమతకు తగ్గట్లు అదనపు గదులు నిర్మించుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని సీఎం చెప్పారు...

**కాంగ్రెస్ ప్రభుత్వానివి 25 లక్షల ఇళ్లు.. బీఆర్ఎస్‌కు 65 వేల ఇళ్లు...**

2004 నుంచి 2014 వరకు పదేళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 25.04 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను పిట్ట గూళ్లని.. కొడుకు, కోడలు, అల్లుడు, బిడ్డ వస్తే ఎక్కడ ఉంటారని ఎన్నికల ప్రచార సభల్లో విమర్శలు గుప్పించిన కేసీఆర్ తన పదేళ్ల పాలనా కాలంలో కేవలం లక్ష డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ప్రారంభించి 65 వేల ఇళ్లు మాత్రమే పూర్తి చేశారని సీఎం విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 35 వేల ఇళ్ల పూర్తికి తాము రూ.195 కోట్లు కేటాయించామని సీఎం తెలిపారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయలేదని... కానీ ఆరు నెలల్లో ఆయన కోసం కోట లాంటి ప్రగతి భవన్‌ను, వాస్తు కోసం సచివాలయాన్నినిర్మించుకున్నారని, గజ్వేల్, జన్వాడల్లో ఫాంహౌస్‌లు నిర్మించుకున్నారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ భవనాల కోసం ఎకరాల కొద్ది భూమి కేటాయించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ తన పదవీ కాలంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయలేదని, ఆయన చెప్పినట్లు కోడి, మేక ఎక్కడ ఉండాలో చూపలేదని.. కానీ కాలనీకో బెల్టు షాపు పెట్టారని సీఎం విమర్శించారు. లక్ష్యం ఎంత గొప్పదైనా అమల్లో లోపాలు ఉంటే ప్రభుత్వ విశ్వసనీయత దెబ్బతింటుందని, పేదవాళ్లకు అన్యాయం జరుగుతుందనే ఆలోచనతోనే ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను సైతం వినియోగిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పునాది స్థాయి నుంచి స్లాబు స్థాయి వరకు ప్రతి దశలోనూ సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించి అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూస్తామని సీఎం హామీ ఇచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం రద్దు చేసిన గృహ నిర్మాణ శాఖను పునరుద్ధరించడమే కాకుండా శాఖకు పూర్తి స్థాయి సిబ్బందిని ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలో తీసుకున్న రుణాలను మాఫీ చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు.

**కేసీఆర్ ఆలోచనా విధానంలో మార్పు రావాలి....**

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో రాష్ట్ర ఖజానాను కేసీఆర్‌కు అప్పగిస్తే.. పదేళ్ల పాలనా కాలం తర్వాత ఆయన రూ.7 లక్షల కోట్ల అప్పుతో తమకు అప్పగించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ పాలనా కాలంలో చేసిన అప్పులు.. తప్పులు సరి చేయడానికి తమకు సమయం పడుతోందని ముఖ్యమంత్రి అన్నారు. ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా పని చేసిన కేసీఆర్ తన అనుభవాన్ని ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత రాజశేఖర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి నివేదికల రూపంలో అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేవారని.. నాడు ఆ మంచి సంప్రదాయం ఉందని.. దానిని కొనసాగించాలని సీఎం సూచించారు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న హరీశ్ రావు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారని... కాంగ్రెస్‌లో చేరేందుకే హరీశ్‌రావు కలిశారనే విమర్శలు నాడు వచ్చాయని సీఎం అన్నారు. సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం రాజశేఖర్ రెడ్డిని కలిశానని హరీశ్ చెప్పారని.. ఇప్పుడు అలానే కలిసి సమస్యలు విన్నవించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున జరుగుతున్నప్పుడే రాజశేఖర్‌రెడ్డిని హరీశ్‌రావు కలిశారని.. మరి ఇప్పుడేమైందని సీఎం ప్రశ్నించారు. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మంత్రులను కలిసి కొడంగల్ నియోజకవర్గానికి రూ.వందల కోట్లు తీసుకెళ్లానని సీఎం తెలిపారు. పాలక, ప్రతిపక్షాలు కలవకుండా చేసింది కేసీఆరేనని, శత్రు దేశ సైనికుల్లా రెండు పక్షాలను కేసీఆర్ మార్చివేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేసీఆర్‌లో మానసిక పరివర్తన రావాలని సీఎం అన్నారు. తమిళనాడులో రాజకీయ వైరుధ్యాలు ఎంతగా ఉన్నా ఆ రాష్ట్ర అంశాల విషయంలో పార్టీలకు అతీతంగా వారంతా ఏకమవుతారని.. ఇక్కడ అలానే కావాలని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేంద్రం నుంచి సాధించాల్సిన అంశాలపై రాష్ట్రంలో 17 మంది లోక్‌సభ, ఏడుగురు రాజ్యసభ సభ్యులకు సూచనలు ఇచ్చేందుకు కలిసి రావాలని కేసీఆర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు.

**ఆటబొమ్మలు విరగ్గొట్టే పిల్లల్లా...**

కేసీఆర్ పదేళ్ల పాలన కాలంలో చేసిన అప్పులకు రూ.6,500 కోట్లు నెలకు వడ్డీ కడుతున్నామని.. రాష్ట్రంలో ఉద్యోగుల జీతభత్యాలకు ఎంత ఖర్చవుతుందో కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీ అంత అవుతోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తాము పాలన పగ్గాలు చేపట్టిన తర్వాత ఆరు నెలలు లోక్‌సభ ఎన్నికల కోడ్‌తోనే సరిపోయిందని.. కేవలం అయిదు నెలల కాలమే తాము పాలనపై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టగలిగామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ అయిదు నెలల కాలంలోనే రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చామని సీఎం తెలిపారు. తాము అభివృద్ధి.. సంక్షేమం రెండింటిన సమతూకం చేసుకుంటూ ముందుకు పోతుంటే చిన్న పిల్లల్లా కేటీఆర్, హరీశ్ రావు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ వాళ్లు చేయలేనిది తాము ఏడాది కాలంలోనే చేస్తుంటే.. హోం వర్క్ చేయని పిల్లలు హోం వర్క్ చేసిన పిల్లాడి నోట్సు చింపివేసినట్లు.. పక్కన వాడి చేతిలో ఆట బొమ్మలు విరగొట్టే చిన్న పిల్లల్లా ఆ ఇద్దరు (హరీశ్‌రావు, కేటీఆర్‌ను ఉద్దేశించి) ప్రవర్తిస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. మనం చేయలేని పని వాళ్లు చేస్తున్నందున.. చూస్తూ ఉండాలని వారిద్దరికి హితవు చెప్పాలని కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. తాము చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకునేందుకు మారీచ సుబాహుల్లా, రాహు కేతువుల్లా వారు అడ్డుపడుతున్నారని సీఎం మండిపడ్డారు. తమకు భేషజాలు లేవని వయసులో, అనుభవంలో కేసీఆర్ పెద్ద వారని, ఆయన పెద్దరికాన్ని నిలుపుకోవాలని, తప్పులు చేస్తున్న తమ పిల్లలకు బుద్ధి చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శాసన సభలో పాలక పక్షానికి ఎంత ప్రాధాన్యత ఉందో ప్రతిపక్షానికి అంతే ప్రాధాన్యత ఉందని సీఎం అన్నారు.. కేసీఆర్ సభకు వచ్చి తాము పాటించే విధానల్లో ఏవైనా లోపాలుంటే తెలియజేయాలని సీఎం సూచించారు.

## కేసీఆర్.. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు ఆహ్వానం...

సచివాలయంలో డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా 7, 8, 9 తేదీల్లో సచివాలయ ప్రాంగణం.. నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో తెలంగాణ సంబరాలు అద్భుతంగా నిర్వహించనున్నట్లు సీఎం చెప్పారు. తెలంగాణ సంస్కృతికి పట్టం కట్టే కార్యక్రమాలు, పిండి వంటలు, మహిళా సంఘాల స్టాళ్లతో ఒక పండగ వాతావరణం నెలకొంటుందని సీఎం చెప్పారు. బోనాలు, వినాయక నిమజ్జనం చేసుకునేప్పుడు ఎలాంటి వాతావరణం ఉంటుందో అలాంటి వాతావరణం ఉంటుందన్నారు. ప్రజలంతా వాటిలో పాల్గొనాలని సీఎం పిలుపునిచ్చారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ప్రతిపక్ష నేత కేసీఆర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో పాటు ఎంఐఎం, సీపీఐ, ఇతర ప్రతిపక్ష నేతలను ఆహ్వానిస్తున్నట్లు సీఎం తెలిపారు. కేసీఆర్ తో పాటు కేంద్ర మంత్రులను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా కలిసి ఆహ్వానిస్తారని సీఎం తెలిపారు. ఈ ఉత్సవానికి ప్రతిపక్ష నేత వచ్చి పెద్దరికం నిలుపుకోవాలని సీఎం సూచించారు.

# హైదరాబాద్‌ను కాలుష్యరహితంగా మార్చేందుకు స్క్రాప్ పాలసీ

**మహాలక్ష్మి పథకంతో నష్టాల నుంచి గట్టెక్కిన ఆర్టీసీ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**రవాణాశాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలు**




హైదరాబాద్,డిసెంబర్ 5 : మహాలక్ష్మి పథకం అమలుతో రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థను నష్టాల నుంచి గట్టెక్కించామని ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి అన్నారు. ఇప్పటివరకు 115 కోట్ల మంది ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారని వివరించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఆర్టీసీ, రవాణశాఖ స్టాళ్లను పరిశీలించారు. రవాణాశాఖ లోగోను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి, రవాణాశాఖ, ఆర్టీసీ విజయాలపై కరపత్రం విడుదల చేశారు. 54 మంది ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. ఏడాదిలోపే 55 వేల ఉద్యోగాలిచ్చామని ఒక్కటి తగ్గినట్లు నిరూపించినా క్షమాపణ చెప్పేందుకు సిద్ధమని మాజీ సీఎం కేసీఆర్, ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి సవాల్ విసిరారు. దేశంలో మెట్రో నగరాలన్నీ కాలుష్యకాసారంతో సతమతమవుతున్న వేళ హైదరాబాద్ ఆ ఊబిలో చిక్కుకోవద్దనే స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రానున్న రెండేళ్లలో భాగ్యనగరంలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. రవాణాశాఖను కాపాడాల్సిన అవసరం ఉంది. వాళ్ల హక్కులను, ఆకాంక్షలను నిలబెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ఆనాడు 6 గ్యారంటీలకు ఆర్టీసీ కార్మికులు తమ బాధ్యతను నెరవేర్చారు. అందుకే ఈనాడు ఈ ప్రభుత్వం విజయం సాధించింది. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ ఇప్పుడు లాభాల్లో నడుస్తోంది. నగరం నిర్మానుష్యంగా మారకుండా ఉండేందుకే స్క్రాప్ పాలసీ తీసుకొచ్చాం. ఈవీ వాహనాలకు రిజిస్ట్రేషన్, ట్యాక్స్ ఫ్రీ చేశామని అన్నారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆర్టీసీకి మంచిరోజులు వచ్చాయని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఆర్టీసీ, రవాణా సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నామని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మూసీ ప్రక్షాళన జరగాలంటే ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 115.76 కోట్ల మంది ప్రయాణించారని తెలిపారు. దీంతో సుమారు రూ.3 వేల 902 కోట్లు ఆదా అయిందని వెల్లడించారు.

# కోటి మందిని కోటీశ్వరులను చేస్తాం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 : సౌరవిద్యుత్తు ప్రాజెక్టులతో ఆడబిడ్డలు అదానీ, అంబానీలతో పోటీపడాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ లక్ష్యం నెరవేరాలంటే.. ప్రస్తుతం 65 లక్షలుగా ఉన్న స్వయం సహాయక బృందాల సభ్యుల సంఖ్య కోటికి పెరగాలని ఆకాంక్షించారు. ఈ కోటి మందిని కోటీశ్వరులను చేసే బాధ్యత తమ సర్కారుదని భరోసా ఇచ్చారు. మాదాపూర్ శిల్పారామంలో కొత్తగా ఏర్పాటు చేసిన 'రాష్ట్రస్థాయి ఇందిరా మహిళా శక్తి బజార్'ను ఆయన గురువారం సాయంత్రం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటైన వెంటనే మహిళాసంక్షేమం కోసం అమలు చేస్తున్న గ్యారెంటీలను గురించి వివరించారు. "మహిళాశక్తిని చాటేందుకు, వారి నైపుణ్యాన్ని ప్రపంచానికి తెలిపేందుకు మూడున్నర ఎకరాల్లో ఇందిరా మహిళాశక్తి స్టాల్స్‌ను ఏర్పాటు చేశాం. ఈ బజార్ దేశంలోనే ఆదర్శంగా ఉండేలా చేయాలి. విదేశీ పర్యాటకులు చార్మినార్, బుద్ధవిగ్రహం, ఐటీకారిడార్‌తోపాటు.. శిల్పారామంలోని మహిళాశక్తి బజార్‌ను సందర్శించనిదే వెలితి ఉండేలా పనిచేయాలి" అని పిలుపునిచ్చారు. %ఈ నెల 9న లక్ష మంది మహిళలతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకుందామన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. దేశం మహిళా సాధికారత వైపు చూస్తోందని, తెలంగాణ దీనికి ఓ నాంది పలికిందని వ్యాఖ్యానించారు. అనంతరం సీఎం, గవర్నర్ దంపతులు 106 స్టాళ్లను సందర్శించి, మహిళా సంఘాల సభ్యులతో ముచ్చటించారు. ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా ఈవెంట్ మేనేజ్‌మెంట్ వ్యాపారాన్ని ప్రారంభించి, ఆర్థికంగా ఎదుగుతున్నట్లు ఆదిలాబాద్ మహిళా సంఘం సభ్యులు వెల్లడించారు. ప్రభుత్వ బడుల విద్యార్థుల యూనిఫారాల ఆర్డర్లను తమకు ఇచ్చినందుకు వివిధ మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. స్వయం సహాయక సభ్యులు ఏర్పాటు చేసిన స్నాక్స్ విందులో అతిథులు పాల్గొనగా.. రేవంత్‌రెడ్డి బిల్లులు చెల్లించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎస్ శాంతికుమారి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మల్‌రెడ్డి రంగారెడ్డి, శంకర్, మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఏడాదైనా ఎన్నికల హామీలను నెరవేర్చని కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి



కాంగ్రెస్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. గురువారం ఢిల్లీలో కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, అధికారంలోకి రాగానే వందరోజుల్లో ఆరు హామీలను నెరవేరుస్తామని కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా, రాహుల్ రాష్ట్ర ప్రజలకు లేఖ రాశారని గుర్తు చేశారు. వంద, రెండొందల రోజులు ఎప్పుడో గడిచిపోయాయని మరో రెండు రోజుల్లో 365 రోజులు కూడా పూర్తి కానున్నాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పరిస్థితి గురివింద గింజ సామెతలా ఉందని అన్నారు. ఆ పార్టీకి హామీలను జ్ఞాపకం చేయడానికి తమ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆ సందర్భంగా తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ఎలా మోసం చేసిందో ప్రజలకు అర్థం అయ్యేలా వివరిస్తామని కిషన్ రెడ్డి చెప్పారు.

# మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం

మొదటి పేజీ తరువాయి



కార్యక్రమంలో దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా శివసేన చీఫ్ ఏక్ నాథ్ షిండే, ఎన్సీపీ నేత అజిత్ పవార్ కూడా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇతర మంత్రులు ఎప్పుడు ప్రమాణ స్వీకారం చేస్తారనే ప్రశ్నకు బీజేపీ (%ఎయిజూ%) నేత సుధీర్ ముంగంటివార్ సమాధానమిస్తూ.. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందే కొత్త మంత్రివర్గం ఏర్పాటు అవుతుందన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహాయుతి కూటమిలోని పార్టీల మధ్య రెండు వారాల తీవ్ర చర్చల తర్వాత కొత్త ప్రభుత్వ ఏర్పాటు జరిగింది. ఇటీవలి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షాలైన శివసేన, ఎన్సీపీలతో కలిసి బీజేపీ నేతృత్వంలోని మహాకూటమికి 230 సీట్లు సాధించింది. బీజేపీ ఒంటరిగా 132 సీట్లు గెలుచుకుంది.మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణ స్వీకారానికి పలువురు సినీ, రాజకీయ, వ్యాపార, క్రీడా రంగ ప్రముఖులు హాజరయ్యారు. వారిలో పలువురు కేంద్ర మంత్రులు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, బిహార్ సీఎం నితీశ్ కుమార్, పలువురు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉన్నారు. అలాగే, బాలీవుడ్ నుంచి షారూఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, సంజయ్ దత్, మాధురి దీక్షిత్, క్రికెటర్ సచిన్ టెండూల్కర్, ప్రముఖ వ్యాపారవేత్త కుమార మంగళం బిర్లా కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ సకుటుంబ సపరివారంగా హాజరయ్యారు. అలాగే, ఈ కార్యక్రమానికి సుమారు 40 వేల మంది బీజేపీ మద్దతుదారులు, మతపెద్దలు హాజరయ్యారు.రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఫడ్నవీస్ రెండోసారి 2014 నుంచి 2019 వరకు బీజేపీ-శివసేన ప్రభుత్వానికి నాయకత్వం వహించారు. 2019 ఎన్నికల తరువాత, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన సీఎం పదవి కోసం బిజెపితో సంబంధాలు తెంచుకున్నప్పుడు, ఫడ్నవీస్ తిరిగి అజిత్ పవార్ మద్ధతుతో సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ఎన్సీపీ ఎమ్మెల్యేల నుంచి తగినంత మద్దతు పొందడంలో అజిత్ పవార్ విఫలం కావడంతో ఈ ప్రభుత్వం కేవలం 72 గంటలు మాత్రమే కొనసాగింది. అనంతరం, శివసేనలో చీలిక రావడంతో షిండే నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో ఫడ్నవీస్ డిప్యూటీ సీఎం అయ్యారు.

# అల్లు అర్జున్‌పై కేసు

- ఆయన భద్రతాసిబ్బందితో పాటు సంధ్య థియేటర్ యాజమాన్యంపైనా!
- మహిళ మృతి నేపథ్యంలో..
- బీఎన్ఎస్‌లోని నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద నమోదు
- అల్లు అర్జున్ వస్తున్నట్టు యాజమాన్యం సమాచారం ఇవ్వలేదు: పోలీసులు
- నేరం రుజువైతే పదేళ్లదాకా జైలు!



హైదరాబాద్,డిసెంబర్ 5 : సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన నేపథ్యంలో.. సినీ నటుడు అల్లు అర్జున్‌పై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు సంధ్య థియేటర్ యాజమాన్యంపైన, అల్లు అర్జున్ సెక్యూరిటీ సిబ్బందిపైనా భారత న్యాయ సంహితలోని సెక్షన్ 105 (హత్య కిందకు రాని ప్రాణనష్టం కేసుల్లో పెట్టే సెక్షన్), 118(1) (ప్రమాదకరంగా వ్యవహరించడం ద్వారా వేరే వ్యక్తులు గాయపడేందుకు కారణం కావడం) వంటి నాన్ బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్ తెలిపారు. ఈ తరహా కేసుల్లో నేరం రుజువైతే గరిష్ఠంగా పదేళ్ల దాకా జైలు శిక్ష పడే అవకాశం ఉంది (గతంలో సల్మాన్‌ఖాన్‌పై పెట్టిన ఐపీసీ 304 సెక్షన్ బీఎన్ఎస్‌లోని సెక్షన్ 105తో సమానం). ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య 70 ఎంఎం థియేటర్‌లో 'పుష్ప 2' సినిమా ప్రీమియర్ షో సందర్భంగా బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో రేవతి(39) అనే మహిళ మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆమె కుమారుడు శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ తొక్కిసలాటలో మరికొంతమందికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో పోలీసుల వైఫల్యంపై విమర్శలు వెల్లువెత్తాయి.

దాంతో పోలీస్ ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో సెంట్రల్ జోన్ డీసీపీ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ప్రీమియర్ షో వీక్షించడానికి హీరో అల్లు అర్జున్ వస్తున్నట్లు సంధ్య థియేటర్ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వలేదని.. హీరో థియేటర్‌లోకి ప్రవేశించడానికి అనువుగా ఉండేలా ప్రత్యేక ప్రవేశ ద్వారం ఏర్పాటు చేయలేదని డీసీపీ తెలిపారు. అభిమానులను నియంత్రించే ఏర్పాట్లుగానీ.. ముందస్తుగా ప్రత్యేక భద్రతా చర్యలుగానీ తీసుకోలేదని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రైవేటు భద్రతా సిబ్బందితో థియేటర్ వద్దకు వచ్చిన అల్లు అర్జున్ నేరుగా థియేటర్‌లోకి వెళ్లకుండా సమీపంలోని క్రిస్టల్ హొటల్ నుంచి ఓపెన్ టాప్ కారులో అభివాదం చేసుకుంటూ లోపలికి వచ్చారని.. ఆయన్ను చూడటానికి, సెల్ఫీలు దిగడానికి అభిమానులు పెద్ద ఎత్తున ఎగబడటం, వందలాది మంది ఒక్కసారిగా చొచ్చుకురావడంతో తొక్కిసలాట జరిగినట్లు విచారణలో తేలిందని డీసీపీ తెలిపారు. ఈ ఘటనలో మరణించిన రేవతి భర్త భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా.. రేవతి మృతదేహానికి గురువారం సాయంత్రం పోస్ట్‌మార్టం పూర్తయ్యిందని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపారు. మృతదేహాన్ని వారి కుటుంబసభ్యులకు అప్పగించామని వివరించారు.

### విషమంగానే శ్రీతేజ్ పరిస్థితి

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన శ్రీతేజ్‌కు కిమ్స్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స చేస్తున్నారు. అతడి ఆరోగ్య పరిస్థితి ఇంకా ఆందోళనకరంగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆస్పత్రికి తీసుకువచ్చేసరికి శ్రీతేజ్ శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నాడని.. దీంతో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స చేస్తున్నామని వైద్యులు వెల్లడించారు. బాలుడి మెదడు, వెన్ను భాగాలకు సీటీ స్కాన్ చేశామని, అవి సాధారణ స్థితిలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.

### పోలీసుల వైఫల్యంపై విమర్శలు

హీరో రాకపై తమకు ముందస్తు సమాచారం లేదని పోలీసులు చెబుతున్నప్పటికీ.. తాము సమాచారం ఇచ్చామని థియేటర్ సిబ్బంది చెబుతున్నట్టు సమాచారం. పుష్ప మొదటి భాగం విడుదల సమయంలో కూడా అల్లు అర్జున్ ఇలాగే ఓపెన్ టాప్ కారులో అందరికీ అభివాదం చేస్తూ థియేటర్‌కు వచ్చారని.. ఆ విషయం తెలిసీ పోలీసులు ఈసారి కనీస జాగ్రత్తలు తీసుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా.. రేవతి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం, తీవ్రంగా గాయపడ్డ ఆమె కుమారుడికి ఉచిత వైద్యం, విద్య అందించాలని తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు, నిర్మాత కేతిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి, టికెట్ రేట్ల పెంపుపై హైకోర్టును ఆశ్రయించిన జర్నలిస్ట్ సతీశ్ కమాల్ డిమాండ్ చేశారు. ఇక.. సంధ్య థియేటర్‌లో వేసింది బెనిఫిట్ షో కాదని, అది ప్రాఫిట్ షో అని.. హైకోర్టు సీనియర్ న్యాయవాది పి.శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.



# మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు

ప్రజానావ, సిరిసిల్ల:

మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టి నట్లు రాజన్న సిరిసిసిల్ల ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. గురు వారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మహిళల రక్షణ విభాగంతో రూపొందించిన షీటీమ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌ల టీమ్‌ల పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల వ్యక్తి గత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. ప్రధానంగా సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురైనపుడు షీటీమ్‌ను ఆశ్రయించాలన్నారు. ఎవరైనా ఆకతాయులు మహిళలు, యువతులను వేధిస్తే కఠినచర్యలు తప్పవని అన్నారు. ఆకతాయిలపై నిరంతర నిఘా పెట్టామన్నారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా షీటీమ్ సంప్రదించాలన్నారు. నేరుగా సంప్రదించలేని వారు జిల్లా షీ టీం 8712656425 నంబర్‌కి సమాచారం అందించాలని,మీయొక్క వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

# పోషకాహారంతో కూడిన భోజనాన్ని అందించాలి

**పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై పిటిషన్..**

**తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు**




హైదరాబాద్,డిసెంబర్ 5 : తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అంశంపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. పాఠశాల్లలో తప్పనిసరిగా విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పోషకాహారంతో కూడిన భోజనాన్ని అందించాలని ఆదేశించింది. భోజనం వికటించిన విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలకు సంబంధించిన నివేదిక సమర్పించాలంటూ విచారణను ఆరువారాలకు వాయిదా వేసింది. కేసు విచారణ సందర్భంగా భోజనం వికటించిన ఘటనల్లో ప్రభుత్వం రెండు కమిటీలు ఏర్పాటు చేసిందని ధర్మాసనానికి ఏఏజీ వివరణ ఇచ్చారు. ఈ ఘటనల్లో బాధ్యులైన వారిని ఇప్పటికే సస్పెండ్ చేశామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ఏజెన్సీలకు చెల్లించే డబ్బులను 40శాతం పెంచినట్లు తెలిపారు. పిటిషర్ తరఫున సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. ప్రధానమంత్రి పోషణ్ పథకం కింద గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలు ఉండాల్సి ఉందని.. కమిటీల పర్యవేక్షణ సరిగా లేపకపోవడం వల్లే భోజనం వికటించే ఘటనలు జరుగుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. కమిటీలు సరిగా పనిచేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనికి ఏఏజీ కమిటీ అన్ని బాగానే పని చేస్తున్నాయని బదులివ్వగా.. హైకోర్టు వివరాలను నమోదు చేసుకున్నది.

# కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చి మాట్లాడాలి

**ఆనాడు రేవంత్ రెడ్డిని చిన్న కేసులో అరెస్ట్ చేశారు**

**కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కక్షపూరిత రాజకీయాలు చేయదు**

**మంత్రి కొండా సురేఖ ఆగ్రహం**

హైదరాబాద్,డిసెంబర్ 5 : బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చిన్న డ్రోన్ కేసులో కక్షపూరితంగా అరెస్ట్ చేశారని మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలకు అధికారం పోయాక కార్యకర్తలు గుర్తుకువస్తున్నారని విమర్శించారు.హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని గంధపు చెక్కల వ్యాపారి అంటూ ఒక బీఆర్ఎస్ నాయకుడు అగౌరవంగా మాట్లాడారని మండిపడ్డారు. కోమటిరెడ్డి సోదరుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ వారికి లేదన్నారు. తెలంగాణ కోసం కోమటిరెడ్డి రాజీనామా చేశారని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కక్షపూరిత రాజకీయాలు చేయదన్నారు. కానీ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నేతల పట్ల కక్షపూరితంగా వ్యవహరించిందని ఆరోపించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. అసెంబ్లీకి రాని నాయకుడు ప్రతిపక్ష నేత ఎలా అవుతారని ప్రశ్నించారు. కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చి మాట్లాడాలన్నారు.

# విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ ఎన్.శ్రీధర్

హైదరాబాద్,డిసెంబర్ 5 : విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ ఎన్.శ్రీధర్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయనకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీచేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన కొనసాగుతారని పేర్కొన్నారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న బుర్రా వెంకటేశంను ప్రభుత్వం టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన వాలంటరీ రిటైర్‌మెంట్‌కు ప్రభుత్వం అనుమతించింది. ఈ నేపథ్యంలో వెంకటేశం స్థానంలో ఎన్.శ్రీధర్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. శ్రీధర్ 1997 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఆయన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు క్యాడర్లలో సేవలందించారు. మొదట రాజమండ్రి సబ్ కలెక్టర్‌గా, ఊట్నూరు ఐటీడీఏ పీఓగా, పోర్ట్స్ డైరెక్టర్‌గా కాకినాడలో పని చేశారు. అనంతరం అనంతపురం, కృష్ణ, వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో కలెక్టర్‌గా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయంలో స్పెషల్ సెక్రెటరీగా మూడేళ్ల మూడు నెలల పాటు పని చేశారు. తెలంగాణ ఏర్పాట తర్వాత నుంచి 2015 జనవరి ఒకటి నుంచి ఇప్పటి వరకు తెలంగాణలోని సింగరేణి కంపెనీ కాలరీస్ లిమిటెడ్ సీఎండీగా బాధ్యతలు నిర్వర్తించారు. గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీధర్ స్థానంలో బలరామ్‌ను సీఎండీగా నియమించిన విషయం తెలిసిందే.

# తప్పులు చేస్తే ఉపేక్షించం

**యూపీఎస్సీతో సమానంగా టీజీపీఎస్సీ పని చేస్తుంది**

**నూతన టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం**

**జీపీఎస్సీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బుర్రా**

**2030 ఏప్రిల్ 4 వరకు కొనసాగే అవకాశం**



హైదరాబాద్,డిసెంబర్ 5 : యూపీఎస్సీతో సమానంగా టీజీపీఎస్సీ పని చేస్తుందని, కమిషన్?పై పూర్తి విశ్వాసాన్ని తిరిగి తీసుకురావడానికి కృషి చేస్తామని నూతన టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్?గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో కమిషన్ సభ్యులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టీజీపీఎస్సీ అభ్యర్థులను ఉద్దేశిస్తూ మాట్లాడారు. పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేస్తామని, ఎడ్యుకేషన్?లో ఉన్న సమయంలో 60 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రణాళిక బద్ధంగా ప్రతి పరీక్ష నిర్వహిస్తామని, పరీక్షలు ప్రశాంతంగా, విశ్వాసభరితంగా రాసేలా చర్యలు తీసుకుంటామని బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. అభ్యర్థులు, నిరుద్యోగులకు న్యాయం చేసేందుకు మూడున్నర ఏళ్ల సర్వీస్?ను వదులుకుని టీజీపీఎస్సీ ఛైర్మన్?గా బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలు లేకుండా పరీక్షలు రాయాలని, టీజీపీఎస్సీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా అంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కమిషన్?కు సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్ కూడా కేటాయిస్తామని ప్రకటించారు. టీజీపీఎస్సీకి స్వయం ప్రతిపత్తి ఉందని, దీంతో ఎవరికీ భయపడకుండా పని చేస్తామని ఉద్ఘాటించారు. ఎవరూ తప్పులు చేసినా ఉపేక్షించమని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. విద్యాశాఖలో ఉండటం వల్ల ప్రశ్నల తయారీపై మంచి అవగాహన సాధించానని, పోటీ పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నల్లో తప్పులు లేకుండా చూస్తామని పేర్కొన్నారు. ఈ పదవిలోకి రావడం ఎంతో సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. తాను కూడా ప్రిపేర్ అయ్యే సమయంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ కరెక్ట్?గా పనిచేయడంతోనే తనకు ఉద్యోగం వచ్చిందని గుర్తు చేసుకున్నారు.టీజీపీఎస్సీ ఛైర్మన్?గా బుర్రా వెంకటేశం 2030 ఏప్రిల్ 4 వరకు కొనసాగనున్నారు. ఐఏఎస్?కు బుర్రా వెంకటేశం స్వచ్ఛంద పదవీ విరమణను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాశాఖ, గవర్నర్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా, జేఎన్?టీయూహెచ్ వీసీగా బుర్రా వెంకటేశం రిలీవ్ అయ్యారు.

# హరీశ్‌రావును అరెస్టు చేయొద్దు

**మినహా తదుపరి దర్యాప్తు చేయొచ్చు.. విచారణకు వాయిదా**

హైదరాబాద్, డిసెంబర్ 5 : పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో హరీశ్ రావును అరెస్టు చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. అరెస్టు మినహా తదుపరి దర్యాప్తు చేపట్టవచ్చని స్పష్టం చేసింది. దర్యాప్తునకు సహకరించాలని హరీశ్‌రావుకు సూచించింది. హరీశ్‌పై ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్‌కు నోటీసులు జారీసింది. విచారణను వాయిదావేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న హరీశ్ రావును అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ సిద్దిపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి చక్రధర్ గౌడ్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో హరీశ్‌రావుపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలంటూ హైకోర్టులో హరీశ్‌రావు పిటిషన్ దాఖలు చేశారు. పంజాగుట్ట పీఎస్‌లో తనపై తప్పుడు కేసు నమోదు చేశారని అందులో పేర్కొన్నారు. రాజకీయ దురుద్దేశంతో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారని ఆయన తెలిపారు. నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌పై ముందుకు వెళ్లకుండా స్టే ఇవ్వాలని కోర్టును కోరారు. ఈనేపథ్యంలో హరీశ్ రావును అరెస్టు చేయవద్దని పోలీసులకు హైకోర్టు స్పష్టం చేసింది. చక్రధర్ తన ఫోన్ ట్యాపింగ్ అయ్యిందంటూ గతంలోనే హరీశ్‌రావుపై కేసు పెట్టారు. తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారంటూ నిరుడు ఆగస్టు 29న తనకు ఆపిల్ కంపెనీ నుంచి మెయిల్ వచ్చిందని ఈ ఏడాది జూన్ 19న డీజీపీకి ఫిర్యాదు చేశారు. తర్వాత పోలీసులు పట్టించుకోవడం లేదని హైకోర్టును ఆశ్రయించారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, హరీశ్‌రావును ప్రతివాదులుగా చేర్చుతూ జూలై 16న రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు విచారణకు స్వీకరించిన తర్వాత నవంబర్ 22న చక్రధర్ తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. మళ్లీ ఇదే అంశంపై పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చక్రధర్‌కు హరీశ్‌పై అనుమానం ఉంటే రిట్ పిటిషన్‌ను ఎందుకు ఉపసంహరించుకున్నారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. హరీశ్‌రావు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ద్వంద్వ నీతిని వీడియో ఆధారాలతో సహా బయటపెట్టిన నేపథ్యంలోనే కక్షతో మంగళవారం కొత్తగా కేసు నమోదు చేయించారని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హరీశ్‌పై నాలుగు కేసులు నమోదయ్యాయి. రైతులకు ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిపై ఒట్టేసి మాట తప్పారని హరీశ్‌రావు ఆగస్టు 22న యాదగిరిగుట్ట ఆలయంలో శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఆయనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రెండో కేసు ఈ ఏడాది అక్టోబర్ 4న సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. మంత్రి కొండా సురేఖకు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు నూలుపోగు దండ వేయడంపై ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. నిందితుడి సోషల్ మీడియాలో హరీశ్ ఫొటో కనిపించిందనే సాకుతో కేసు నమోదు చేశారని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు. మూడో కేసు ఈ ఏడాది అక్టోబర్ 25న బేగంబజార్‌లో నమోదైంది. హామీలను ఎగవేస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డిని 'ఎగవేతల రేవంత్‌రెడ్డి' అని సంభోదించినందుకు హరీశ్‌పై కేసు నమోదు చేశారు. నాలుగో కేసు కరీంనగర్‌లో నవంబర్ 25న నమోదైంది. ఓ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డిని విమర్శించారన్న కారణంతో కేసు నమోదు చేశారు.

# అరెస్టులు.. హైడ్రామా!

మొదటి పేజీ తరువాయి

కోరారు. ముఖ్యమైన పనిమీద బయటకు వెళుతున్నానని స్టేషన్‌లో మిగతా సిబ్బందికి ఫిర్యాదు ఇవ్వాలని సీఐ సమాధానమిచ్చినా కౌశిక్‌రెడ్డి వినిపించుకోలేదు. ఆయనతో వాగ్వావాదానికి దిగారు. దీనిపై సీఐ రాఘవేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు బీఎన్ఎస 57,126(2), 127(2), 132, 224, 333, 451(3), 191(2) రెడ్ విత్ 190,3(5) కింద కేసులు నమోదు చేశారు. గురువారం ఉదయం పోలీసులు భారీ బందోబస్తుతో కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన్ను, మరో 20 మంది బీఆర్ఎస్ కార్యకర్తలను బంజారాహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అంతకుముందు... విషయం తెలియడంతో కౌశిక్‌రెడ్డి ఇంటికి హరీశ్ రావు వెళ్లారు. మీ దగ్గర ఎఫ్ఐఆర్ ఉందా? నోటీసులు ఇచ్చారా? అని పోలీసులను హరీశ్ ప్రశ్నించారు. ఎఫ్ఐఆర్ ఉన్నందున నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని పోలీసులు చెప్పారు. ఎఫ్ఐఆర్ చూపించాలని అడగగా.. ప్రస్తుతం తమ దగ్గర లేదని చెప్పిన పోలీసులు అక్కడి నుంచి హరీశ్‌ను అదుపులోకి తీసుకొని గచ్చిబౌలి పోలీసస్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో కౌశిక్ ఇంటివద్ద హరీశ్ అభిమానులు ఆందోళన చేయడంతో కాస్త ఉద్రిక్తత నెలకొంది. ఇక కౌశిక్‌రెడ్డి నివాసం వద్దకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి రాగా వారినీ పోలీసులు అదుపులోకి తీసుకొని రాయదుర్గం పోలీసస్టేషన్‌కు తరలించారు. హరీశ్ అరెస్టు విషయం తెలియడంతో పార్టీ శ్రేణులు అక్కడికి తరలివచ్చాయి. వెంటనే ఆయన్ను విడుదల చేయాలని స్టేషన్ ముందు బైఠాయించారు. కాగా గచ్చిబౌలి పీఎసలో ఉన్న హరీశ్‌ను కలిసేందుకు బీఆర్ఎస్ నేతలు తరలివచ్చారు.

ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాగంటి గోపినాథ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు హరీశ్‌ను కలిశారు. రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లోని జగదీశ్వర్‌రెడ్డిని పలువురు నేతలు కలిశారు. హరీశ్‌ను కలిసిన అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన కౌశిక్‌రెడ్డిపై కేసు పెట్టడం దారుణమన్నారు. ఉదయం నుంచి అరగంటకో సెక్షన్ మారుస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే పల్లా, ఎర్రబెల్లి మాట్లాడుతూ రేవంత్ ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలు నేరవేర్చడంలో విఫలమయ్యారని, దానిని ప్రశించినందుకు బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కాగా హరీశ్ అరెస్టును




నిరసిస్తూ సిద్దిపేట జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ కార్యకర్తలు దహనం చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ జాతీయ రహదారిపై ఎమ్మెల్యే సునీతా రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించి, సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, హరీశ్ అరెస్టు చేశారని ఆరోపిస్తూ ఇందుకు నిరసనగా శుక్రవారం నెక్లెసరోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలు చేపట్టేందుకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది.

**సైకో, ఫ్యాక్షనిస్టులా రేవంత్ తీరు**
**పగ, ప్రతీకారంతో విపక్ష నేతలను టార్గెట్ చేస్తున్నారు: హరీశ్**

హైదరాబాద్ సిటీ: 'సీఎం రేవంత్ రెడ్డి సైకోలా, ఫ్యాక్షనిస్టులా వ్యవహరిస్తున్నారు. పగ, ప్రతీకారంతో శాడిస్టిక్ ప్రెషర్‌తో పని చేస్తున్నారు. ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టేందుకు లక్ష్యం చేసుకుంటున్నారు' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. కేసులు, ఎఫ్ఐఆర్‌లు పోలీసస్టేషన్లలో నమోదు కావడం లేదని, గాంధీభవన్‌లో తయారు చేస్తున్నారని విమర్శించారు. గచ్చిబౌలి పోలీసస్టేషన్ నుంచి విడుదలైన అనంతరం హరీశ్ మీడియాతో మాట్లాడారు. మార్పు.. మార్పు.. అన్న రేవంత్.. నిర్బంధాలు, అక్రమ అరెస్టులు తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. పోలీసులను అతిగా ప్రయోగించిన ఏ ప్రభుత్వమూ నిలబడదనే సంగతి సీఎం గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి శాశ్వతం కాదన్న విషయాన్ని పోలీసులూ గుర్తుంచుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రజా పాలన కాదు.. రాక్షస పాలన నడుస్తోందని విమర్శించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడినైన తనను ఎందుకు అరెస్టు చేస్తున్నారని రాహుల్ గాంధీ అడుగుతున్నారని.. మరి, తెలంగాణలో వాళ్ల పార్టీ ప్రభుత్వం చేస్తున్నదేమిటి? అని మండిపడ్డారు. రేవంత్‌ను బాగుచేయాలని, లేదంటే సీఎంను మార్చాలని రాహుల్‌ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఏడాదిలో ఎన్నడైనా కేసీఆర్ పేరెత్తకుండా మాట్లాడారా?మీరు బూతులు తిడితే మేం భరించాలా? మీకు సూచనలివ్వాలా? అని రేవంత్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డిని అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారని, 12 గంటలైనా మెజిస్ట్రేట్ ముందు ఎందుకు ప్రవేశపెట్టలేదు? అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డిని విడుదల చేసే వరకు నిద్రపోమని, ఆయనకు అండగా ఉంటామన్నారు.

# నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదాలు

**ప్రజలకు చట్టాలంటే భయం లేదు..**
**ప్రజల సహకారం లేకుండా రోడ్డు ప్రమాదాలు తగ్గించలేం**
**ప్రమాదాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి**
**ప్రజల నిర్లక్ష్యం వల్ల బాధితుల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది**
**కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆవేదన**



న్యూఢిల్లీ, డిసెంబర్ 5 : రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ ప్రజల నిర్లక్ష్యం వల్ల బాధితుల సంఖ్య ఏటికేడు పెరుగుతోందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలంటే ప్రజలకు భయం లేకుండా పోయిందన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల నిత్యం ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. తానూ రోడ్డు ప్రమాద బాధితుడినే అని తెలిపారు. పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి లోక్ సభలో సమాధానం ఇచ్చారు. దేశంలో ఏడాది కాలంలో 1.68 లక్షల మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని... ఇందులో 60 శాతం మంది యువకులే ఉన్నట్లు తెలిపారు. మహారాష్ట్రలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో రోడ్డు ప్రమాదంలో తన కాలు విరిగినట్లు చెప్పారు. అందుకే ఈ అంశం తనకు చాలా ప్రత్యేకమైనదని అన్నారు. ప్రజాప్రతినిధులు, మీడియా, ప్రజల సహకారం లేకుండా రోడ్డు ప్రమాదాలు తగ్గించడం సాధ్యం కాదన్నారు. జరిమానాలు ఎంత పెంచినా ప్రజలు నిబంధనలు పాటించడం లేదని వాపోయారు. రోడ్ ఇంజినీరింగ్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, సమర్థవంతంగా చట్టాల అమలు, ప్రజలకు అవగాహన... ఈ నాలుగు ముఖ్యమైన అంశాలన్నారు. చాలామంది రెడ్ సిగ్నల్ పడితే ఆగరు... హెల్మెట్ పెట్టుకోరని వాపోయారు. నిన్న తన కళ్లముందే ఓ కారు రెడ్ సిగ్నల్‌ను క్రాస్ చేసిందన్నారు.

# ప్రయాణికులకు తీపికబురు చెప్పిన రైల్వే

**జనరల్ బోగీలను పెంచనున్న సౌత్ సెంట్రల్ రైల్వే**



న్యూఢిల్లీ, డిసెంబర్ 5 : ఎక్స్ప్రెస్, సూపర్ఫాస్ట్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్యను దశలవారీగా పెంచుతున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు రెండే జనరల్ కోచ్ లు ఉన్న రైళ్లలో ఆ సంఖ్యను నాలుగుకు చేరుస్తున్నట్లు పేర్కొన్నారు. అవి కూడా ఆధునిక పరిజ్ఞానం కలిగిన ఎల్.హెచ్.బి కోచ్ లు ఉంటాయని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు వెల్లడించారు. జోన్ పరిధిలోని 21 జతల రైళ్లకు అదనగా 80 ఎల్.హెచ్.బి బోగీలను అందుబాటులోకి తీసుకొస్తామన్న సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు. రైళ్లలో పేదలు ప్రయాణించే జనరల్ బోగీల రూపం కూడా మారబోతున్నది. ఇన్నాళ్లు రైళ్లలో పాతకాలం నాటి సాధారణ బోగీలే ఉన్నాయి. చాలా రైళ్లలో రెండే బోగీలు ఉండటంతో పేద ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దాని కారణంగా జనరల్ బోగీల సంఖ్యను పెంచేందుకు రైల్వేబోర్డు కార్యాచరణ ప్రారంభించింది. కొత్తగా వస్తున్న జనరల్ బోగీలను ఎల్.హెచ్.బి పరిజ్ఞానంతో తయారుచేసినవి ప్రవేశ పెడుతున్నారు. పాత తరం ఐసీఎఫ్ బోగీల్లో 90 సీట్లు ఉంటే.. ఎల్.హెచ్.బి బోగీల్లో సీట్ల సంఖ్య 100 ఉంటాయి. ఇందులో ఎక్కువ మంది ప్రయాణించే అవకాశం ఉంటుంది. ప్రమాదాలు జరిగినప్పుడు సైతం తక్కువ నష్టం ఉంటుందంటున్న రైల్వే అధికారులు. ఏసీ, స్లీపర్ క్లాస్ లలో మాత్రమే ఎల్.హెచ్.బి బోగీలను రైల్వే శాఖ ప్రవేశపెడుతూ వచ్చింది. కానీ తాజాగా ఇప్పుడు జనరల్ క్లాస్ లలో ఎల్.హెచ్.బి కోచ్ లను అందుబాటులోకి ఇస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే. ఇప్పటికే జోన్ పరిధిలో 19 ఎక్స్ ప్రెస్ రైళ్లకు ఎల్.హెచ్.బి కోచ్లను 66 కోచ్లను ప్రవేశపెట్టారు. గౌతమి, దక్షిణ్, నారాయణాద్రి తదితర ఎక్స్ప్రెస్ రైళ్లలో అదనంగా ఎల్.హెచ్.బి జనరల్ కోచ్ లు వచ్చాయి. రైల్వేశాఖ దేశవ్యాప్తంగా 370 రైళ్లలో అదనంగా ఎల్.హెచ్.బి బోగీలను దశలవారీగా జత చేస్తోందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఫలితంగా రోజూ అదనంగా 70 వేల మంది ప్రయాణికులు జనరల్ బోగీల్లో ప్రయాణించేందుకు ఆస్కారం ఉంటుంది. సాధారణ ప్రయాణికులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

# షిండే శఖం ముగిసింది.. ఆయన మళ్లీ సీఎం కాలేరు

**సంజయ్‌రౌత్ కీలక వ్యాఖ్యలు**

ముంబై, డిసెంబర్ 5 : ఏక్‌నాథ్ షిండేని బీజేపీ ఇన్ని రోజులూ ఉపయోగించుకుందని.. ఇప్పుడు మాత్రం పక్కకు నెట్టేసిందని వ్యాఖ్యానించారు. 'షిండేని బీజేపీ పావులా వాడుకుంది. ఇప్పుడు పక్కకు నెట్టేసింది. ఇక షిండే శకం ముగిసింది. ఆయన మళ్లీ ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాలేరు. ఆయన అవసరం కూడా బీజేపీకి లేదు. అవసరమైతే షిండే పార్టీని కూడా బీజేపీ విచ్ఛిన్నం చేయగలదు. ఇది ప్రధాని మోదీ రాజకీయ పంథా' అని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. మహాయుతికి స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ.. 15 రోజులైనా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయారని రౌత్ అన్నారు. అంటే వారి కూటమిలో ఏదో లోపం ఉందని అర్థమవుతోందన్నారు. అది ఇవాళ కాకపోయినా తర్వాతైనా బయటకి వస్తుందని చెప్పుకొచ్చారు. బుధవారం విధాన్ భవన్‌లో జరిగిన సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు ఫడ్నవీస్‌ను బీజేపీ ఎల్పీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫడ్నవీస్ ముఖ్యమంత్రి కానున్నారని, మహారాష్ట్రలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడుతున్నట్టు బీజేపీ పరిశీలకులు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, విజయ్ రూపాని ప్రకటించారు. దీంతో ఫడ్నవీస్, ఏక్‌నాథ్ సిండే, అజిత్ పవార్ నేతృత్వంలోని మహాయుతి ప్రతినిధి బృందం బుధవారం సాయంత్రం గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరింది. గురువారం సాయంత్రం 5.30 గంటలకు దక్షిణ ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా మూడోసారి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. ఫడ్నవీస్‌తో పాటు ఉప ముఖ్యమంత్రులుగా శివసేన నేత, మాజీ సీఎం ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ నేత అజిత్ పవార్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఉప ముఖ్యమంత్రి పదవి తీసుకునేందుకు మొదట షిండే మొండికేశారు. ఆయనను డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించాల్సిందిగా బీజేపీ అధిష్ఠానం, ఫడ్నవీస్ పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఆయన స్పందించలేదు. చివరకు బుధవారం సాయంత్రం అంగీకరించిన షిండే.. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తానని ప్రకటించారు.

# నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్ఎల్వీ-సీ59

**ఇస్రో రాకెట్ ప్రయోగం సూపర్ సక్సెస్**



శ్రీహరికోట, డిసెంబర్ 5 : పీఎస్ఎల్వి సి-59 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. శ్రీహరి కోట నుంచి ఇస్రో చేసిన ఈ రాకెట్ ప్రయోగం సూపర్ సక్సెస్ అయ్యింది. ప్రోబా-3 ఉపగ్రహాలను కక్ష్యలోకి విజయవంతంగా పంపింది. ఈ ప్రోబా-3ని యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ రూపొందించింది. సూర్యుడిపై పరిశోధలనకు గానూ ఈ ప్రోబా-3 ఉపయోగపడనుంది. ఈ ఉపగ్రహాలు సూర్యకిరణాలపై మరింత డెప్త్‌గా అధ్యయనం చేయనున్నాయి. కరోనా పరిశీలనలో ఇబ్బందులను అధిగమించేలా ఈ ఉపగ్రహాలను రూపొందించారు శాస్త్రవేత్తలు. ప్రోబా-3 శాటిలైట్లతో%ా%ఇక సూర్యుడి సీక్రెట్స్ తెలిసిపోనున్నాయివాస్తవానికి డిసెంబర్ 4 సాయంత్రం 4:08 గంటలకు ప్రయోగించాల్సిన పీఎస్ఎల్వీ సీ-59 రాకెట్ ప్రయోగం వాయిదా పడింది. నిన్న మధ్యాహ్నం 2:38 నిమిషాలకు శ్రీహరికోట సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్‌లో దీనికి కౌంట్ డౌన్ మొదలైంది. ఇంతలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ ప్రయోగాన్ని ఆ మర్నాటికి వాయిదా వేశారు. తిరిగి డిసెంబర్5న సాయంత్రం 4:12 గంటలకు ఇస్రో ఈ రాకెట్‌ను ప్రయోగించింది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ.. ప్రోబా-3ని రూపొందించింది. ఈ మిషన్ ద్వారా రెండు ఉపగ్రహాలను నింగిలోకి పంపించారు. వీటిని ఒకే కక్ష్యలో ఏర్పాటు చేశారు. ఇది భూమి నుంచి 60 వేల కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాపై కీలక పరిశోధనలు జరపనున్నారు. దీనిపై నిఘా పెట్టడం ద్వారా ఎప్పటికప్పుడు అప్ డేట్స్ తెలుసుకోనున్నారు. ఈ రెండు ఉపగ్రహాలు పరస్పర సమన్వయంతో ఒకే భూ కక్ష్యలో పయనిస్తుంటాయి. ప్రోబా-3 మిషన్‌లో ప్రయోగించిన ఉపగ్రహాలు కృత్రిమ సూర్యగ్రహణ పరిస్థితులను సృష్టిస్తాయి. తద్వారా సూర్యుడి బయటి పొర అంటే.. కరోనాను అధ్యయనం చేస్తాయి. ఈ జంట ఉపగ్రహాల్లో ఒక దాంట్లో కరోనాగ్రాఫ్ ఉంటుంది. మరొకటి ఆల్టరర్ కలిగి ఉంటుంది. ఈ ఉపగ్రహాలలో ఒకటి సూర్యుడిని కనిపించకుండా కృత్రిమ గ్రహణం పరిస్థితి సృష్టిస్తే.. మరొకటి కరోనాను నిశితంగా గమనిస్తూ వస్తుంది. ప్రోబా-3 మిషన్ స్పెయిన్, పోలాండ్, బెల్జియం, ఇటలీ, స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తల కృషి ఫలితం. మిషన్‌లో రెండు ఉపగ్రహాలను ఒకేసారి ప్రయోగించారు. ఈ ఉపగ్రహాలు నిర్ణీత కక్ష్యలోకి చేరుకోవడం కీలకం. ఎందుకంటే ఒకదానితో మరొకటి సమన్వయం చేసుకుంటూ కరోనాపై అధ్యయనం చేస్తాయి. ఇందులో ఏ ఒక్కటి పని చేయకపోయినా రెండో శాటిలైట్‌కు ఉపయోగం లేకుండాపోతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

# ఢిల్లీలో కొంత మెరుగు

**పెరుగుతున్న గాలిలో నాణ్యత**

న్యూఢిల్లీ, డిసెంబర్ 5 : ఢిల్లీలో వాయు కాలుష్యం మెరుగుపడింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. గురువారం ఉదయం 8 గంటల సమయంలో ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 165గా నమోదైంది. ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 178, ఛాందినీ చౌక్ వద్ద 194, ఐటీవో ప్రాంతంలో 130, వాజీపూర్‌లో 152, ఓఖ్లా ఫేజ్-2 వద్ద 147, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 145, పట్పర్గంజ్‌లో 164, ఆయా నగర్‌లో 107, లోధీ రోడ్డులో 128, ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 3 వద్ద 162, పంజాబీ భాగ్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 152గా నమోదైంది. అదే సమయంలో కొన్ని ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లలో గాలి నాణ్యత పూర్ కేటగిరీలో నమోదైంది. ఆర్కేపురంలో 204, ముంద్కాలో 222, షాదీపూర్‌లో 249, నెహ్రూ నగర్‌లో 247, జహన్‌గిర్‌పురిలో 206గా గాలి నాణ్యత సూచీ నమోదైంది. గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ధర్పల్లి,((ప్రజానావ)):**
ధర్పల్లి మండలంలోని 2000-2001 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుదవారం మండల కేంద్రంలో నిర్వహించారు. మొదటగా చనిపోయినటువంటి వ్యక్తులను గుర్తు చేసుకొని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అందరూ ఒకే చోట చేరి ఒక్కొక్కరుగా మాట్లాడుతూ.... ప్రస్తుతం వారి కుటుంబం మరియు వారు ఉద్యోగం,పనుల గురించి చర్చించుకుని అల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే తమకు విద్య నేర్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. చివరిగా భోజనం ఏర్పాటు చేసుకొని అందరూ కలిసి బంతి భోజనం చేసి ఆడి,పాడి ఆనందంగా గడిపారు.

## రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక



**సిరికొండ, (ప్రజానావ):**
సిరికొండ మండల కేంద్రంలోని మైలారం శివారులో గల సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు సిద్దార్థ, రేవంత్ లు తెలంగాణ స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుండి 9 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ లోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్ 17) సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ఆర్ నర్సయ్య తెలిపారు. గత నెల 9న ఆర్మూర్ లో జరిగిన జిల్లా స్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన పాఠశాల విద్యార్థులను ప్రిన్సిపల్ గురువారం ప్రత్యేక జ్ఞాపికలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రిన్సిపల్ ఆర్ నర్సయ్య మాట్లాడుతూ...విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని, మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయాన్నారు. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరచలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగారెడ్డి,అనిల్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు ..



**చేగుంట, (ప్రజానావ):**
మెదక్ జిల్లా, చేగుంట మండలం, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర వైద్య. కుటుంబ సంక్షేమ మరియు శాస్త్ర సాంకేతిక శాఖామాత్యులు దామోదర్ రాజనర్సింహ జన్మదిన సందర్భంగాసంగారెడ్డి లోని తన స్వగృహంలో మర్యాదపూర్వంకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గందారి లత నరేందర్ రెడ్డి. దుబ్బాక కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ చెరుకు విజయ్ రెడ్డి. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కన కయ్య. రాయపోల్ మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్. దౌల్తాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పడాల రాములు. నాయకులు మహిపాల్ రెడ్డి. సోలిపేట ప్రసాద్ రెడ్డి. విజయపాల్ రెడ్డి మద్దెల స్వామి. బండారి లాల్ తోగుట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఊళ్లేంగాల సాయి..పంచామి గణేష్ పడల మల్లేశం రమేష్. రవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలో వచ్చే మార్పులపై అవగాహన



**భీమ్‌గల్,(ప్రజానావ):**
భీమ్‌గల్ మండలంలోని బెజ్జోరా, ముచ్కూర్, గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో గురువారం జిల్లా వర్డ్ స్వచ్ఛంద సంస్థ మానిటరింగ్ కోఆర్డినేటర్ లావణ్య, ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రెండు గ్రామాలలోని 8 తరగతి నుంచి 10 తరగతి వరకు చదువుకునే విద్యార్థిని, విద్యార్థులకు విద్యార్థి దశలో వచ్చే మార్పులపై, అలాగే విద్యార్థులకు నూతన చట్టాలు ఫోక్స్ అనేది ఒక చట్టం, బాల్య వివాహాల, బాల కార్మిక నిరోధక చట్టాల పై ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో విద్యార్థిని విద్యార్థులకు వేరువేరుగా అవగాహన కల్పించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత,రక్తహీనత, పోషకాహారం లోపం గుడ్ టచ్ బాడ్ టచ్ చట్టాలు, బాల్య వివాహాలు, బాలవిద్యార్థి దశలు వచ్చే మార్పులపై అవగాహన కల్పిస్తూ జాగ్రత్తగా ఉండాలని బాలబాలికలకు వేరువేరుగా అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు...

# 'ఉపాధి' ఉద్యమం రాజకీయ పోరాటమే

**డిబిఎఫ్ నేతలు వినయ కుమార్, పి. శంకర్**




**గజ్వేల్, (ప్రజానావ):**
జాతీయ గ్రామీణ ఉపాధి హామి హక్కుల పరిక్షణ కొసము జరుగుతన్న ఉద్యమం రాజకీయ పోరాటమెనని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్, పి.శంకర్ లు అన్నారు. గ్రామీణ ఉపాధి హామి పథకాన్ని ఎత్తివేతకు కేంద్రప్రభుత్వం చెస్తున్న కుట్రలను మానుకొవాలని, బడ్జెట్ పెంచాలని డిమాండ్ చెస్తు గురువారం ప్రారంభమైన ధర్నాలో డిబిఎఫ్ నేతలు వినయ్ కుమార్, శంకర్ లు మాట్లాడుతూ నిధుల కేటాయింపును తగ్గిస్తున్నారని ఆరోపించారు. గత ఆర్థిక సంవత్సరంలో కనీసం పని డిమాండ్ చేసిన వారందరికీ చట్టబద్ధంగా హామీ ఇవ్వబడిన 100 రోజుల పనిని అందించడానికి బడ్జెట్ జి.డి.పి లో కనీ సం రెండు శాతం ఉండాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు లు చెసినప్పటికి ప్రస్తుత బడ్జెట్ కేటాయింపు కేవలం 86,000 కోట్లు మాత్రమేనన్నారు. ఇది సగటు ఉపాధిహామి వేతన రేటుతో 34 రోజులు పని దినాలు కల్పించెందుకు మాత్రమే సరిపోతుందన్నారు. ఉపాధి హామి వేతన వేతనాలు చట్టబ ద్ధమైన కనీస వ్యవసాయ వేతనాల కంటే తక్కువగా ఉన్నా యన్నారన్నారు. కనీస రోజు వారీ వేతనం కనీసం 800 వంద లకు పెంచాలని డిమాండ్ చేశారు. సకాలంలో వేతనాలు చెల్లిం చాలన్నసరు. నిధులు తగినంతగా ఉన్నప్పుడు మాత్రమే వేత నాలు సకాలంలో చెల్లించడం సాధ్యమవుతుందన్నారు. అధికారిక మార్గదర్శకాల ప్రకారం, రాష్ట్రాల నుండి ఎలక్ట్రానిక్ ఇన్వాయిస్ లను స్వీకరించిన 7 రోజులలోపు కేంద్ర ప్రభుత్వం వేతనాలను బదిలీ చేయాలన్నారు.
అధార్ అనుసంధానాన్ని తప్పనిసరి చేయడాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. పనులు కల్పించకుండానే దేశ వ్యాప్తంగా పది కొట్ల మంది కూలీల పేర్లను జాబ్ కార్డుల నుండి తొలగించడం చట్ట విరుద్ధమన్నారు. ఈ ధర్నాలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు దాసరి ఎగొండ స్వామి,పులి కల్పన, రాష్ట్ర ఉపాధ్యక్షులు దుబాషి సంజివ్, చుంచు రాజేందర్, లిబిటెక్ ఇండియా ప్రతినిధి చక్రధర్ బుద్ధ తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకం సంబరాలు


**- పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ**



**కామారెడ్డి, (ప్రజానావ):**
కామారెడ్డి పట్టణంలోని ఆర్టీసీ వారు నిర్వహించిన మహాలక్ష్మి పథకం ప్రజా పాలన విజయోత్సవాలలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియా మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేసినటువంటి పథకాలు, దాంట్లో ముఖ్యమైన పథకం మహాలక్ష్మి పథకం అని అన్నారు. మహాలక్ష్మి పథకంతో రోజుకు 45.49 లక్షల నుంచి 58.13 లక్షలకు 27.80 శాతం పెరిగిన ప్రయాణికుల మహిళా సంఖ్య. అలాగే మేడారం జాతర 2024 లో వేల మందికి అమ్మవారి ప్రసాదం పార్సెల్ అంద జేత చేయడం జరిగిందనీ ఆమె తెలియజేశారు. హైదరాబాద్ నుండి శ్రీశైలం వరకు ఏసి బస్సులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ కౌన్సిలర్లు, సుల్తానా సలీం,లడ్డు మొయినుద్దీన్, డిపో మేనేజర్ ఇందిరా, డిప్యూటీ ఆర్.ఎం,శంకర్, సమీర్ లింగం, కండక్టర్ మహిళలు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ పేదలకు చేయూతనిస్తుంది

**- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు**



**జుక్కల్, డిసెంబర్ 5 (ప్రజానావ):**
కామారెడ్డి జిల్లా అనారోగ్యం భారిన ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేయించుకున్న పేదలకు సీఎంఆర్ఎఫ్ చేయూతనిస్తోందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు అన్నారు. పిట్లం మార్కెట్ యార్డులో గురువారం మండలంలోని 25 మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అలాగే పిట్లం మండలం కారేగాం తాండకు కు చెందిన వడిత్య బుజ్జి భర్త కొన్ని నెలల కిందట మృతి చెందారు. ఆమెకు ఓ ఇన్సూరెన్స్ కంపెనీ కింద రూ. 17,56,000 మంజూరైన చెక్కు ను మేనేజర్ రాజు, ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆమెకు అందజేశారు. ఆయన మాట్లా డుతూ భీమా ఉంటే జీవితానికి అదో ధీమా. అది కుటుంబానికి ఆర్థిక భద్రత. ఏం జరిగినా ఒక భరోసాను కల్పిస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు అన్నారు. ఇందులో ఏఎంసి వైస్ ఛైర్మన్ కృష్ణ రెడ్డి, నాయకులు హన్మండ్లు, మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శివ, బొడ్ల రాజు, అశోక్, మొయిన్, ఇమ్రోజ్ పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా రమేష్

**భీమారం, (ప్రజానావ):**



కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన యూత్ ఎలక్షన్ లో భాగంగా భీమారం మండలం నుండి చెన్నూర్ నియోజక వర్గ స్థాయి లో ప్రధాన కార్యదర్శి గా ఎన్నికైన ఆర్కల రమేష్.. కార్యకర్త స్థాయి నుండి నియోజక వర్గ స్థాయి వరకు అంచెలు అంచెలుగా ఎదుగుతూ, పార్టీకి విధేయు డుగా ఉంటూ ప్రజల మన్ననలు పొందుతూ పార్టీలో తన కంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు... ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ విజయానికి సహక రించిన పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, ప్రత్యేకంగా యువతకు, ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని, ప్రభుత్వం చేపడుతున్న పనులను ప్రజలకు తీసుకెళ్తానని,మండల సమస్యల పై చెన్నూరు శాసనసభ సభ్యులు వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇస్తున్నాను.అని చెప్పడం జరిగింది. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి చెరవేరుస్తానని పేర్కొన్నారు. పార్టీ అభ్యున్నతికి మరింత పాటుపడుతానని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలందరితో పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు.

## ఆటోల బంద్‌ను జయప్రదం చేయండి

**టీయూసిఐ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్**



**ధర్పల్లి, (ప్రజానావ):**
ఈనెల 7న జరిగే రాష్ట్రవ్యాప్త ఆటో మోటార్ల బంద్ పిలుపులో భాగంగా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిజా మాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలో బంద్ పోస్టర్ ఆవిష్కరించిన టి యు సి ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ రమేష్. సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల ఆటోడ్రైవర్ల జీవనం, జీవనోపాధి అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసారు. ఎన్నికల సమయంలో ఆటో డ్రైవ ర్లకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ ప్రభు త్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకా రం ప్రతి ఆటోడ్రైవరుకు సంవత్సరానికి రూ. 15 వేలు ఆర్థిక సహాయం అమలు చేయాలన్నారు. రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. మహాలక్ష్మి పథకం ఫ్రీ బస్సు వల్ల ఆర్థికంగా నష్టపోయి - ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ల కుటుంబాలకు రూ. 10 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించాలని కోరారు. ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ చెల్లిం చాలని, యాక్సిడెంట్ బీమాను రూ. 10లక్షలకు పెంచాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం ఉదాసీన వైఖరిని నిరసిస్తూ ఆటో బంద్ లో భాగంగా నెహ్రూ పార్క్ నుండి ధర్నా చౌక్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆటో, క్యాబ్ డ్రైవర్లు, రవాణా రంగ కార్మి కులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ బంధ్ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలనీ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ల నాయకులు, ఆటో కార్మికులు హైమద్, రమేష్, చిన్న బాబు, లక్ష్మణ్, నరేష్, జానీ, బాబురావు, తది తరులు పాల్గొన్నారు.

## రైతులు నేల ఆరోగ్యం కాపాడుకోవాలి

**- ఏఓ డా.టి.నాగేందర్ రెడ్డి - ఘనంగా ప్రపంచ మృత్తిక దినోత్సవం**




**మర్కుక్, (ప్రజానావ):**
సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని మూడు రైతు వేదికల లో ప్రపంచ మృత్తిక దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి టి.నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు విచక్షణ రహితంగా రసాయన ఎరువుల ను, పురుగు మందులను వాడటం వల్ల నెలలు జీవ రహితంగా మారుతున్నాయి అని తెలిపారు. కావున రైతులు సేంద్రియ ఎరువులు వేసుకోవాలని అన్నారు. సేంద్రియ ఎరువుల వలన నేల భౌతిక స్థితి (నేల ఆకృతి) మెరుగుపడి, భూమి గుల్లగా మారి నేలలోనికి నీరు ఇంకే గుణం పెరుగుతుంది. నేలలో సేంద్రియ పదార్థం వేయడం వల్ల సూక్ష్మ జీవులు వృద్ధి చెంది , జీవ రసాయనిక చర్యల వలన నేల సారం పెరగడమే కాక, నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకుని ఉత్పాదకత సామర్థ్యాన్ని పెంచుకుంటుంది. నేలలో క్లిష్ట (లభ్యం కాని) రూపం లో ఉన్న అనేక పోషకాలను లభ్య రూపం లోకి మారుస్తాయి. (మినిరలైజేషన్) భూమిలో రసాయన ఎరువులు వేసినప్పుడు వాటి లభ్యత పెరగడానికి హరిత ఎరువులు ఉపయోగ పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రజినీకాంత్, విష్ణు వర్ధన్, మీనాక్షి, రైతులు పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**ఆర్మూర్ టౌన్, (ప్రజానావ):**



ఆర్మూర్ చేపూర్ గ్రామంలో గురువారం వినయ్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోస్తవంలో భాగంగా ప్రజలకు సంక్షేమ పథకాలు, రైతులకు వడ్ల బోనస్ 500 ఇస్తునందుకు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమం లోఆర్మూర్ మండల అధ్య క్షులు చిన్నరెడ్డి, మాజీ సర్పంచ్ సాయన్న, జన్నా పల్లి గంగాధర్, శాంతి, వినోదకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల మదిని చూరగొన్న మహాలక్ష్మి

## - బాలికల విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయి - మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్





**మెదక్, (ప్రజానావ):**
టిఎస్ఆర్టిసి ఆధ్వర్యంలో ఘనంగా ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమమే ధ్యేయంగా ఆర్టీసీ మహాలక్ష్మి పథకం మహిళల మదిని చూర గొన్న పథకమని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం మెదక్ పట్టణంలో.ప్రజా పాలన - ప్రజా విజయో త్సవాల వేడుకలను డిసెంబర్ 1 నుండి 9 వరకు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఐదో రోజులో భాగంగా టిఎస్ఆర్టిసి ఆధ్వర్యంలో మహాలక్ష్మి పథకం అమలుపై కార్యక్రమంనిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ చంద్రపాల్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్టీసీ డిఎం సురేఖ, వార్డ్ కౌన్సిలర్, సంబంధిత ఆర్టీసీ యూనియన్ సంఘాలు, తదితరులు పాల్గొన్నారు. మహాలక్ష్మి కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తెలంగాణ పల్లె వెలుగు ఎక్స్ ప్రెస్ బస్సులలో, మహిళలు ఆధార్ కార్డు ద్వారా జీరో టికెట్ కొనుగోలు చేసి 01 కోటి 60 లక్షలు మంది ఉచిత ప్రయాణం చేసి 53 కోట్ల రూ-పాయలు ఆదా చేసుకున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వానికి సంవత్సర కాలంలో 3, వేల 856 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది అన్నారు. ఆర్టీసీకి భారం అయినప్పటికీ మహిళలను గమ్య స్థానాలు చేర్చడంలో ఆర్టీసీ సిబ్బంది సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆర్టీసీ పల్లె వెలుగులు, ఎక్స్ప్రెస్ లలోనే ఉచిత ప్రయాణం కాకుండా టికెట్ కొను గోలు చేసే ఆర్థిక స్తోమత ఉన్నవారు , ఉద్యోగులు, డీలక్స్ బస్సులలో ప్రయాణించి ఆర్టీసీ సంస్థ మనుగడకు చేదోడి నివ్వాలని చెప్పారు. ఫుట్ బోర్డు ప్రయాణం అత్యంత ప్రమాదకరమని ప్రయాణికులు దీని బాధ్యతగా తీసుకొని గమనించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయాణికులను ఫుట్ బోర్డులో ప్రయాణం చేయకుండా ఆర్టీసీ డ్రైవర్ కండక్టర్ బాధ్యతగా మెలిగి ప్రయాణికులతో మమేకమై పటిష్ట చర్యలు చేపట్టాలని వివరించారు. దివ్యాంగులకు రిజర్వ్ చేసిన సీట్లను వారికే కేటాయించే విధంగా చూడాలన్నారు.రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఆదేశించిన విధంగా మహిళా శక్తి ద్వారా రుణాలు మంజూరు చేసి వారితో ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయించి అదే బస్సులను ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన తీసుకునే విధంగా చర్యలు చేపట్టి ఇది జిల్లాలో గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపడతామన్నారు.మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.
మున్సిపల్ చైర్ పర్సన్ చంద్రపాల్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం మహిళల పాలిట వరమని ఎంతోమంది మహిళలు, చిరు వ్యాపారాలతో జీవనోపాధి కొనసాగిస్తున్నారని, బాలికలు విద్యాభ్యాసం నిమిత్తం నిత్యం బస్సులలో ప్రయాణించి లబ్ధి పొందుతున్నారన్నారు, రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల అమలు క్షేత్రస్థాయిలో సత్ఫలితాలను ఇస్తున్నాయని ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని ఆదరించాలని చెప్పారు.
ఆర్టీసీ డిఎం సురేఖ మాట్లాడుతూ జిల్లాలో టీఎస్ ఆర్టీసీ సేవలు మహాలక్ష్మి పథకం అమలు తీరు వివరిస్తూ ఆర్టీసీ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఎప్పుడు లేని విధంగా గ్రౌండ్ హెల్త్ పాలసీ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించి వారి ఆరోగ్య పరిస్థితిని చక్కదిద్దెల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఉద్యోగ విధి నిర్వహణలో ఆర్టీసీ ఉద్యోగులు నిర్వహణలో ఎంత కష్టమైనాప్పటికీ క్రమశిక్షణకు మారుపేరుగా పనిచేస్తున్నారని కొనియాడారు. త్వరలో మెదక్ జిల్లాకు పర్యావరణ రహిత ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయని శుభ పరిణామంగా పేర్కొన్నారు. అనంతరం డీలక్స్ బస్సులలో ప్రయాణించి లక్కీ డిప్ లో గెలు పొందిన మహిళా ప్రయాణికులకు ఉచిత బహుమతులతో సన్మానించారు. వుడ్ బోర్డ్ ప్రయాణాలు ప్రమాదకరమని ఆర్టీసీ ముద్రించిన కరపత్రాలను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఆర్టిసి యూనియన్ సభ్యులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ మృత్తిక దినోత్సవం



**చేగుంట,గజ్వేల్, (ప్రజానావ):**
మెదక్ జిల్లా, చేగుంట మండలం, ఈరోజు ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవం సందర్భంగా చేగుంట మండల పరిధిలో గల క్లస్టర్లలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా రుక్మాపూర్ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసా-య అధికారి ఎం హరి ప్రసాద్ మాట్లాడుతూ రైతులు నేలను సారవంతంగా ఉంచుకోవడానికి తీసుకోవలసిన మెలకువలు, నేల యొక్క రకాలు వాటి లక్షణాలు గురించి వివరించడం జరిగింది. నేల సారవంతం పెంచుకోవడానికి సేంద్రియ ఎరువులు మరియు పచ్చి రొట్టె ఎరువులు విధిగా వాడాలని మరియు రసాయనిక ఎరువులను సిఫారసు మేరకు మాత్రమే వాడాలని, అధిక రసాయనిక ఎరువులు వాడకూడదని రైతులకు వివరించడం జరిగింది. ఇదే కాకుండా వరి పంట పూర్తి అయిన తర్వాత వరి కొయ్యలను కాల్చకుండా నేలలో కలియ దున్నడం ద్వారా సేంద్రీయ కార్బనాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి పిఎసిఎస్ చైర్మన్ శ్రీ మేకల పరమేష్ గారు ఏ ఈ ఓ అశోక్ రెడ్డి గారు రైతులు నాగయ్య రమేష్ గార్లు తదితరులు పాల్గొనడం జరిగింది.



## మిషన్ భగీరథ నీటి నాణ్యతపై అవగాహన



**భీమారం, (ప్రజానావ):**
రోజున జైపూర్ గ్రామపంచాయతీ లోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ల వద్ద పిచ్చి మొక్కలు తొలగించడం,గేట్ వాల్స్ వద్ద పిచ్చి మొక్కలు తొలగించడం జరిగింది మరియు జైపూర్ జెడ్పీఎస్ఎస్ హై స్కూల్ లో మిషన్ భగీరథ నీటి నాణ్యత ను వివరించే కార్యక్రమంలో మిషన్ భగీరథ నీటికి మరియు ఆర్ ఓ వాటర్ ( డబ్బా వాటర్) కు మధ్య తేడాను బ్లబ్ టెస్టింగ్ సహాయం తో పిల్లలకు, టీచర్ల కు వివరించడం జరిగింది మిషన్ భగీరథ నీటిని శుద్ధి చేసే విధానం ను పిల్లల కు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎంపిడిఓ జి.సత్యనారాయణ, డిఇ ఆర్ డబ్ల్యు ఎస్ ఏ.విద్యాసాగర్,మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు, స్కూల్ హెడ్ మాస్టర్,అసిస్టెంట్ కెమిస్ట్ సంతోష్, స్కూల్ స్టాఫ్ , స్కూల్ పిల్లలు పాల్గొనటం జరిగింది

## న్యాయమే గెలిచింది



**ఆర్మూర్ టౌన్,(ప్రజానావ):**
ఆర్మూర్ పట్టణం అంబేద్కర్ చౌరస్తా దగ్గర ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి రాజకీయ కక్షతో తనపై అక్రమ కేసులు బనాయించిన వ్యవహారంలో కోర్టు తన అనుకులంగా తీర్పుచేప్పడంతో న్యాయమే విజయం సాధించిందని బీజేపీ బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్ వెల్లడించారు. ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి , మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి తో కలిసి 2022 సంవత్సరంలో బీజేపీ చేరినా తనపై కక్ష కట్టి అప్పటి రూరల్ సీఐ గోవర్ధన్ రెడ్డి తో అక్రమ కేసులు పెట్టినట్లు తెలిపారు. అలాగే తన సీడ్ ప్లాంట్ సీజ్ చేయించారన్నారు. ఆర్మూర్ కోర్టు లోక్ అదాలతో 3 కేసులు రైతులు విడ్రా చేసుకోవడం జరిగింది. కాగ హైకోర్టు తప్పులు కేసులుగా తీర్పు వెల్లడించిందన్నారు. ఎప్పటికైన న్యాయమె గెలుస్తుందని. కక్ష సాధింపు రాజకీయాలు ఎక్కవ కాలంగా నిలబడవన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు డొన్కాంటి లింగన్న, ప్రభాకర్,లింగం,శ్రీకాంత్, బాలయ్య పాల్గొన్నారు.

## వైకల్యాన్ని జయిస్తే ఉన్నత శిఖరాలకు..

**ఆర్మూర్,(ప్రజానావ):**
మనో ధైర్యంతో తమలోని వైకల్యాన్ని జయిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఆర్మూర్ మండల విద్యాధికారి రాజ గంగారాం సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని భవిత కేంద్రంలో సమగ్ర శిక్షణ సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో గురు వారం రోజు ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు తమలోని వైకల్యాన్ని బలహీనతగా భావించకుండా, బలంగా భావించి పట్టుదలతో చదువులు పూర్తి చేయాలన్నారు. తల్లిదండ్రులు సైతం వారిని నిరుత్సాహపరిచకుండా ప్రోత్సహించాలన్నారు. భవిత కేంద్రంలో ప్రతీ గురువారం ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలతో పాటు భవిత కేంద్రానికి వచ్చే దివ్యాంగులకు బహు మతులు అందజేశా-రు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీ వైద్యురాలు అరుణ, దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీ కిషన్, సురేష్, ఏంఐఎస్ కోర్డినేటర్ అలేఖ్య, ఆపరేటర్ రఘు, మెసెంజర్ రవి, సీజీవీ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

## సోనాలవాసికి జెఎల్



**బోథ్,(ప్రజానావ):**
బోథ్ మండలంలోని సోనాల గ్రామానికి చెందిన తుల దత్తు ఇచ్చోడలో ట్రైబల్ వెల్ఫేర్ కలశాలలో జంతుశాస్ర అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. గురువారం ప్రకటించిన జంతుశాస్త్ర విభాగములో జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపిక అయ్యారు. ఎన్నోసార్లు తృటిలో ఉద్యోగాన్ని చేజారిన పట్టు వదలకుండా అను కున్న లక్ష్యాన్ని చేరుకొని ఉద్యోగాన్ని పొందటముతో పలువురికి ఆదర్శంగా నిలవడముతో పలువురు అభినందించారు

## బాలికపై లైంగిక దాడి?

**ఆర్మూర్, (ప్రజానావ):**
ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పెరికిట్లో బ్రతుకుతెరువు కొరకు జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాల నుండి వచ్చి నివాసం ఉంటున్న ఒక మైనర్ బాలిక పై పేర్కిట్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డట్టు పట్టణ కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. బాధితురాలి కుటుంబ సభ్యులు ఆర్మూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం, జరిగిన దాడి మైనర్ బాలిక కావడంతో వివరాలు తెలడంలో పోలీసులు సంకోచిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ విషయం పై స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.సత్యనారాయణ గౌడ్ ను వివరాలు కోరగా వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిక




**భీమ్‌గల్, (ప్రజానావ):**
భీమ్‌గల్ మండలం బడా భీమ్‌గల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జంగం ప్రభు, దండు పోషన్న, గురువారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు వారికి ముత్యాల సునీల్ కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాగుల మోహన్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**ఆర్మూర్, (ప్రజానావ):**
నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలో గురువారం రోజు ప్రజా పాలనా, ప్రజా ప్రభుత్వం ఏడాది పూర్తి ఐనా సందర్భంగా రైతు విజయోత్సవంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి సునీల్ రెడ్డి, చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ఇంచార్జి హరి కిసాన్, లక్కోర కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.



## రైతులందరూ ఆనందంగా ఉన్నారు




**భీమ్‌గల్, (ప్రజానావ):**
ప్రజా పాలన విజయోత్సవ భాగంగా రైతు మహిళా సంబరాల్లో భాగంగా, భీమ్‌గల్ మండలం మెండోరా గ్రామంలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో మహిళలు రైతులు పాలభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా డిసిసి డెలికేట్ కుంట రమేష్ మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ ఒక సంవత్సరంలోనే మహిళలకు పావుల వడ్డీ వారి ఖాతాలో వేయడం, రెండు లక్షల బీమాస్ సదుపా-యం ప్రతి మహిళా సంఘాల సభ్యులం దరికీ కల్పించడం, మహిళా శక్తి పథకంలో భాగంగా ప్రతి మహిళకు వ్యక్తిగతంగా ఐదు లక్షల రుణ సదుపా-యం కల్పించడం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం, వరి కొనుగోలు కేంద్రాల్లో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేసి ఆర్థికంగా మహిళా సంఘాలను బలోపేతం చేయడం, రాబోయే రోజులో ప్రతి నియోజకవర్గానికి 314 కోట్ల రుణాలు ఇచ్చేలా లక్ష్యాన్ని రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం నిర్దేశించు కుందని, మహిళలను లక్షా ధికారులను చేసేలా రేవంత్ రెడ్డి రుణపడి ఉంటా మని అన్నారు. కావున ఈ రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉండాలని వారికి కోరారు. రైతు లకు రుణమాఫీ ఏకకాలంలో 25, లక్షల మంది రైతులకు, 21,వేల కోట్ల రు-ణమాఫీ చేయడం జరి గిందని, సన్నవడ్లకు 500, బోనస్ ఎకరానికి 12,500 చొప్పున బోనస్ రైతుల ఖాతాలో వేయడం జరిగిందని రాష్ట్రంలోని రైతులందరూ కూడా ఆనందంగా ఉన్నారని, వచ్చే జనవరిలో రైతు భరోసా కూడా రైతుల ఖాతాలో వేయడం జరు గుతుందని ముఖ్యమంత్రి ప్రకటించడం వల్ల రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని, ప్రతిపక్షాల మాయమాటలు నమ్మకుండా రైతుల ప్రభుత్వానికి అండగా ఉండాలని వారికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య , ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనంత రావు, బీసీ సెల్ అధ్యక్షుడు కోరాడిరాజు, మల్లెల లక్ష్మణ్, నల్లూరి శీను, పల్లె శేఖర్ కుంట రమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు రాజేశ్వర్ గౌడ్, ఉపాధ్య క్షుడు గౌరు లింబాద్రి, నిమ్మల రాజేందర్, సత్య నారాయణ, చిన్నయ్య, నర్సయ్య, భూమన్న, ఖదీర్, రాజన్న, గణేష్ రైతులు సత్యం గంగారెడ్డి, లింభారెడ్డి, గంగయ్య, భూమన్న,గంగ సాయిలు, చిన్నారెడ్డి, వడ్డే భూమేష్,50 మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## బందును జయప్రదం చేయండి



**ఆర్మూర్, (ప్రజానావ):**
ఆర్మూర్ మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో గురువారం రోజు ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా, సిఐటియు ఆధ్వర్యంలో ఆటో వర్కర్స్ తో డిసెంబర్ 7న రాష్ట్ర వ్యాప్త బంధు పిలుపు కొరకు పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు ఎం.ముత్తన్న, సిఐటియు ఆర్మూర్ మండల కన్వీనర్ కూతాడి ఎల్లయ్య లు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో, టాక్సీ, క్యాబ్, డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలుకై తెలం గాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆటో, క్యాబ్, డ్రైవర్ల ఒక్కరోజు రాష్ట్రవార్త బందును జయప్రదం చేసి చలో హైదరాబాద్ కు వేలాది మంది తరలి రావాలని తెలంగాణ రాష్ట్ర ట్యాక్స్ క్యాబ్ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ విజ్ఞప్తి చేస్తుందని వారు అన్నారు. హైదరాబాదులో సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ఇంద్ర పార్క్ ర్యాలీ అనంతరం బహి రంగ సభకు అధిక సంఖ్యలో పాల్గొని జయ ప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనిట్ సెంటర్ ఆఫ్ ఇండి యా జిల్లా నాయకులు జి.అరవింద్, మండల నాయకులు ఎండి.నజీర్, టి.శీను, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మహమ్మద్ అఖిల్, కార్యదర్శి, అమీన్, ఆటో డ్రైవర్స్ పఠాన్, మదర్ ఖాన్, ఎండి అమిన ఉద్దీన్, సయ్యద్ అజిత్, ఎండి మునీర్, ఎండి ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.




# ఆ అమ్మాయిలా పోరాడండి

## నాగచైతన్య వివాహంపై సమంత ఇంట్రెస్టింగ్ కామెంట్

అక్కినేని నాగచైతన్య, శోభిత ధూళిపాళ్ల వివాహం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో వీరిద్దరూ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. అయితే, వీరి వివాహం వేళ సమంత పోస్ట్ ఆసక్తికరంగా మారింది. సామ్ సోషల్ మీడియా వేదికగా స్ఫూర్తినింపే వీడియోలు, కొటేషన్‌లూ పంచుకుంటున్న విషయం తెలిసిందే. తాజాగా అలాంటి వీడియో ఒకటి ఇన్‌స్టా స్టోరీస్‌లో తాజాగా షేర్ చేసింది. ఈ వీడియోలో ఒక అమ్మాయి, అబ్బాయి మధ్య కుస్తీ పోటీ జరుగుతోంది. మొదట్లో ఆ అబ్బాయి పూర్తి ఆత్మవిశ్వాసంతో ఆటలోకి దిగుతాడు. చివరికి అమ్మాయి చేతిలో ఓడిపోతాడు. ఈ వీడియో షేర్ చేసిన సామ్.. 'ఈ అమ్మాయిలా పోరాడండి' అంటూ క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం పోస్ట్ వైరల్‌గా మారింది. కాగా, సామ్ గత కొంతకాలంగా గడ్డుపరిస్థితుల్ని ఎదుర్కొంటోన్న విషయం తెలిసిందే. నాగ చైతన్యతో విడాకుల అనంతరం కొద్దిరోజులకే మయోసైటిస్ బారిన పడింది. దాన్నుంచి కోలుకునేందుకు సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చింది. ఇప్పుడిప్పుడే.. మళ్లీ తిరిగి తన వర్క్‌లైఫ్‌లో బిజీగా మారుతుండగా ఇంతలో తన తండ్రి జోసెఫ్ ప్రభు హఠాత్తుగా మరణించారు. మరోవైపు మాజీ భర్త మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు.



# నాకు అదే పెద్ద విజయం

## అల్లు అర్జున్

'పుష్ప', 'పుష్ప 2' సినిమాలతో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పేరు ప్రపంచవ్యాప్తంగా మోత మోగిపోతుంది. ఆ సినిమాలు ఇచ్చిన సక్సెస్‌లు అలాంటివి మరి. కానీ ఈ సినిమాల కంటే కూడా తనకు అసలైన విజయం వేరే ఉందని తెలుపుతూ.. అల్లు అర్జున్ ఓ ట్వీట్ చేశారు. ఆ ట్వీట్ మ్యాటర్‌లోకి వెళితే.. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2 ది రూల్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదలై రూల్ చేస్తోంది. 'పుష్ప' చిత్రంతో తన సత్తా చాటిన అల్లు అర్జున్, ఇప్పుడు 'పుష్ప 2'తో మరోసారి తన పవర్‌ని బాక్సాఫీస్‌కి పరిచయం చేస్తున్నారు. అయితే 'పుష్ప', 'పుష్ప2'లు ఎంతగొప్పగా విజయాలు సాధించినా కూడా.. అల్లు అర్జున్‌కు మాత్రం వాటికంటే కూడా పెద్ద విజయం ఒకటుంది. అదేంటని అనుకుంటున్నారా? 'పుష్ప 2' విడుదల వేళ తన కుమారుడు అల్లు అయాన్ రాసిన లేఖ. అవును.. ఈ లేఖని ట్విట్టర్ ఎక్స్‌లో షేర్ చేసిన అల్లు అర్జున్ ఇదే తను సాధించిన అతి పెద్ద విజయమని ప్రకటించారు. అల్లు అయాన్ తన స్వ హస్తాలతో 'ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ యు నాన్న' అంటూ ఓ లేఖను రాశారు. ఈ లేఖను ఎక్స్‌లో పోస్ట్ చేసిన అల్లు అర్జున్ ఎమోషనల్ అవుతూ.. ఈ లెటర్ తన హృదయాన్ని హత్తుకున్నట్లుగా పేర్కొన్నారు. ఇంతకీ ఈ లెటర్‌లో ఏముందంటే.. "మీ సక్సెస్ పట్ల నాకు ఎంత గర్వంగా ఉందో చెప్పేందుకు ఈ లెటర్ రాస్తున్నా నాన్న.. ఈరోజు నాకు చాలా ప్రత్యేకం.. ఎందుకంటే ప్రపంచంలోనే ఒక గొప్ప నటుడి సినిమా రిలీజ్ అవుతోంది. నాకు మిక్స్‌డ్ ఎమోషనల్ ఫీలింగ్స్ ఉన్నాయి. పుష్ప 2 సినిమా మాత్రమే కాదు.. సినిమా పట్ల నీకున్న నిబద్ధతని తెలియజేస్తుంది. నా జీవితంలో ఎప్పటికీ నువ్వే హీరో నాన్న. నీకున్న కోట్లాది మంది అభిమానుల్లో నేను ఒకడిని" అంటూ అల్లు అయాన్ ప్రస్తావించాడు. చివరిగా పుష్ప అంటే ఫైర్ కాదు.. వైల్డ్ ఫైర్ అంటూ ఈ లెటర్‌లో పేర్కొన్నాడు. కొడుకు అల్లు అయాన్ చిన్న పిల్లాడు రాసిన లేఖ కాబట్టి ఏమైనా తప్పులు ఉంటే పెద్ద మనసుతో అర్థం చేసుకోండి అని అల్లు అర్జున్ పోస్ట్‌లో ప్రస్తావించాడు. ఈ లెటర్ చూసిన బన్ని అభిమానులు లైక్స్‌తో తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. కాగా, ఈ లేఖలోనే కాదు.. ఇటీవల జరిగిన 'పుష్ప 2' ప్రీ రిలీజ్ వేడుకలోనూ, అల్లు అర్జున్ అటెండ్ అయిన 'అన్‌స్టాపబుల్ షో'లోనూ అల్లు అయాన్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచిన విషయం తెలిసిందే. 'పుష్ప తగ్గేదేలే' అంటూ యాక్షన్ చేసి ఫ్యాన్స్‌ను అలరించాడు.

# ఓటీటీలోకి అలియాభట్ జిబ్రా



బాలీవుడ్ అగ్ర కథానాయిక అలియా భట్ నటించిన రీసెంట్ సూపర్ హిట్ చిత్రం 'జిగ్రా'. ఈ సినిమాకు వసన్ బాల దర్శకత్వం వహించగా.. ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కరణ్ జోహార్, అపూర్వ మెహతా, అలియా భట్, షాహీన్ భట్ సోమెన్ మిశ్రా సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం డిసెంబర్ 06 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు వెల్లడించింది. బ్రదర్, సిస్టర్ సెంటిమెంట్‌తో వచ్చిన ఈ సినిమాలో అలియా భట్ అక్కగా నటించగా.. వేదాంగ్ రైనా తమ్ముడి పాత్రలో నటించాడు. టాలీవుడ్ నటుడు రాహుల్ రవీంద్రన్ కీలక పాత్రలో మెరిశాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తమ చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన సత్యభామ ఆనంద్ (అలియా భట్) తమ్ముడికి (వేదాంగ్ రైనా) అన్ని తానై పెంచుతుంది. అయితే ఒక బిజినెస్ పని మీద హన్షదావో అనే దీవికి వెళతాడు అంకుర్. ఈ క్రమంలోనే అతడి చేయని తప్పుకు డ్రగ్స్ కేసులో ఇరుక్కుంటాడు. అయితే డ్రగ్స్ వాడినందుకు కోర్టు అంకుర్‌కు మరణశిక్ష విధిస్తుంది. ఈ విషయం సత్యభామకి తెలియడంతో తన తమ్ముడిని కాపాడుకునేందుకు హాన్షదావోకి వెళుతుంది. అయితే సత్య అక్కిడికి వెళ్లాక ఆమెకు ఎదురైన పరిస్థితులేంటి? తన తమ్ముడిని మరణశిక్ష నుంచి తప్పించి బయటకు తీసుకువచ్చిందా.. అసలు అంకుర్ డ్రగ్స్ కేసులో ఎలా ఇరుక్కున్నాడు అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

# పుష్ప 2తో ఆల్ ఇండియా హిస్టరీ కొట్టావు : రాంగోపాల్ వర్మ



నేషనల్ అవార్డు విన్నర్, టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'పుష్ప ది రూల్'. బ్లాక్ బస్టర్ మూవీ పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాకు సుకుమార్ దర్శకత్వం వహిస్తుండగా రష్మిక మందన్నా కథానాయికగా నటించింది. ఇక తెలుగు ప్రేక్షకులతో పాటు వరల్డ్ వైడ్‌గా మూవీ లవర్స్ ఎదురుచూస్తున్న ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ప్రీమియర్స్ నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. ఇదిలావుంటే ఈ మూవీపై దిగ్గజ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ఆసక్తికర పోస్ట్ పెట్టాడు. పుష్ప 2 ది రూల్ సినిమాతో ఆల్ ఇండియా ఇండస్ట్రీ హిట్ ఇచ్చినందుకు అల్లు అర్జున్‌తో పాటు చిత్ర బృందానికి ఆయన అభినందనలు తెలియజేశారు. అల్లు అర్జున్ ఈజ్ మెగా మెగా మెగా మెగా మెగా స్టార్ అంటూ ఆసక్తికర కామెంట్ చేశారు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ వైరల్‌గా మారింది. పుష్ప 2 విడుదలకు ముందుకూడా మెగా కంటే అల్లు ఎన్నో రెట్లు మెగా అని, కేవలం గ్లోబల్ స్టార్ మాత్రమే కాదు, ప్లానెట్ స్టార్ అని వర్మ కితాబునిచ్చాడు.

# సంధ్య థియేటర్ యాజమాన్యంపై కేసు


ఆర్టీసీ క్రాస్ రోడ్స్?లోని సంధ్య థియేటర్? యాజమాన్యంపై కేసు నమోదు అయ్యింది. సంధ్య థియేటర్‌లో పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా విషాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. సినిమా చూసేందుకు వచ్చిన అభిమానుల మధ్య జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ మృతిచెందారు. బుధవారం రాత్రి పుష్ప 2 బెనిఫిట్ షోను చూసేందుకు హీరో అల్లు అర్జున్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌కు రాగా.. అతడిని చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. దీంతో తొక్కిసలాట చోటుచేసుకున్నది. ఈ క్రమంలో వారిని నిలువరించేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. దీంతో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి (39) అనే మహిళతో పాటు ఆమె కుమారుడు శ్రీతేజ్ (9) కింద పడిపోయి జనాల కాళ్ల మధ్య నలిగిపోయారు. వారిద్దరూ తీవ్ర గాయాలతో సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే తల్లీకుమారులను పోలీసులు పక్కకు తీసుకెళ్లి సీపీఆర్ చేశారు. ఆ తర్వాత ఓ ప్రైవేట్ దవాఖాన తరలించగా.. చికిత్స పొందుతూ రేవతి మృతి చెందారు. శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉండటంతో నిమ్స్?హాస్పిటల్‌కు తరలించగా.. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. అయితే ఈ ఘటనకు సంబంధించి సంధ్య థియేటర్? యాజమాన్యంపై కేసు నమోదు అయ్యింది. థియేటర్ యాజమాన్యం సెక్యూరిటీ సరిగ్గా ఏర్పాటు చేయకపోవడంతోనే తొక్కిసలాట జరిగి ఓ మహిళ మృతి చెందరాని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు సంధ్య థియేటర్ యాజమాన్యంపై ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారు.

# రష్మిక సినిమాకు స్టార్ హీరో వాయిస్



పుష్ప సినిమాతో నేషనల్ క్రష్‌గా మారిపోయి సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది కన్నడ సోయగం రష్మిక మందన్నా . చేతినిండా ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న ఈ భామ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి ది గర్ల్‌ఫ్రెండ్. రష్మిక లీడ్ రోల్‌లో వస్తోన్న ఈ చిత్రానికి టాలీవుడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నాడు. చాలా కాలానికి ఈ సినిమాకు సంబంధించిన క్రేజీ వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తుంది. ఈ మూవీ టీజర్‌కు స్టార్ యాక్టర్ విజయ్ దేవరకొండ వాయిస్ ఓవర్ ఇచ్చినట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. సిల్వర్ స్క్రీన్‌పై సూపర్ కాంబోగా నిలిచిన రష్మిక మందన్నా-విజయ్ దేవరకొండ ప్రేమలో మునిగి తేలుతున్నట్టు ఇప్పటికే ఇండస్ట్రీ సర్కిల్‌లో న్యూ హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. గర్ల్‌ఫ్రెండ్‌కు సపోర్ట్ ఇస్తూ సినిమాపై క్యూరియా సిటీ పెంచేస్తున్నాడు విజయ్ దేవరకొండ. ఈ మూవీలో చికాగో బ్యూటీ అనూ ఇమ్మాన్యుయేల్ కీ రోల్‌లో కనిపించనుంది. ఈ మూవీని అల్లు అరవింద్ సమర్పణలో మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై విద్య కొప్పినీడి, ధీరజ్ మొగిలినేని తెరకెక్కిస్తున్నారు. కన్నడ యాక్టర్ దీక్షిత్ శెట్టి కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీకి పాపులర్ మలయాళ మ్యూజిక్ డైరెక్టర్ హేశమ్ అబ్దుల్ వహబ్ సంగీతం అందిస్తున్నాడు.

# పుష్ప.2 స్క్రీనింగ్ లేనట్లే.. అధికారికంగా ప్రకటించిన ప్రసాద్ మల్టీప్లెక్స్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన తాజా చిత్రం పుష్ప 2 ది రూల్ గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే బుధవారం రాత్రి నుంచి ప్రీమియర్ షోలు పడుతుండగా.. బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకుని రన్ అవుతుంది ఈ చిత్రం. అయితే ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ప్రసాద్స్ మల్టీప్లెక్స్‌లో ఓపెన్ అవ్వలేదన్న విషయం తెలిసిందే. గత నాలుగు రోజులు నుంచి అభిమానులు కూడా ప్రసాద్స్‌లో ఎప్పుడు స్టార్ట్ అవుతాయా ఎప్పుడూ బుకింగ్ చేద్దామా అని ఆతృతతో ఎదురుచూస్తున్నారు. దీనికి కారణం ఏంటి అని చూస్తే.. ప్రసాద్ మల్టీప్లెక్స్ యాజమాన్యంకు.. 'పుష్ప 2' నిర్మాతలు మైత్రి మూవీ మేకర్స్‌కి ఇంకా డీల్ కుదరట్లేదు అని తెలుస్తుంది. ఈ సినిమాకు సంబంధించి ప్రసాద్ నుంచి ఎక్కువ షేర్ మైత్రి అడిగినట్లు సమాచారం. అయితే ఈ వార్తలపై ప్రసాద్స్ మల్టీప్లెక్స్ తాజాగా స్పందించింది. పుష్ప 2 సినిమాను ప్రసాద్స్‌లో ప్రదర్శించట్లేమని వెల్లడించింది. మా విలువైన స్పానర్స్ కి, పార్టనర్స్‌కి.. 2 దశాబ్దాలకు పైగా.. మేము సినీ ప్రేక్షకులకి గొప్ప సినిమా అనుభూతిని అందించడానికి కట్టుబడి ఉన్నాము. అనుకోని కారణాల వల్ల, మేము పుష్ప 2 సినిమాను ప్రసాద్స్ మల్టీప్లెక్స్‌లో ప్రదర్శించలేక పోతున్నాము. ఈ విషయం మీకు ఇబ్బంది కలిగించి ఉంటే మేము దానికి చాలా చింతిస్తున్నాము. ఈ విషయంలో మా హృదయపూర్వక క్షమాపణలు తెలుపుకుంటున్నాము. ఈ వివాదాన్ని అర్థం చేసుకొని మాతో ఉన్నందుకు ధన్యవాదాలు. మీ మద్దతు.. విధేయత మాతో ఎల్లప్పుడు ఉంటాయని కోరుకుంటున్నాము అంటూ ప్రసాద్స్ అధికారికంగా వెల్లడించింది.

www.prajanaava.in
హైదరాబాద్
శుక్రవారం 6, డిసెంబర్ 2024
ప్రజానావ

# ఓపెనర్ కేఎల్ రాహులే

## రోహిత్ శర్మ




ఆస్ట్రేలియాతో పింక్ బాల్ టెస్ట్‌కు టీమిండియా ఓపెనర్ ఎవరా? అనే సందిగ్దతకు కెప్టెన్ రోహిత్ శర్మ క్లారిటీ ఇచ్చాడు. కేఎల్ రాహులే ఓపెనర్‌గా కొనసాగుతాడని స్పష్టం చేశాడు. మిడిలార్డర్‌లో తాను బ్యాటింగ్ చేస్తానని వెల్లడించాడు. ఈ నిర్ణయం తనకు కష్టమైనా.. జట్టుకు అదే బెస్ట్ అని అభిప్రాయపడ్డాడు. ఆసీస్‌తో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో శుభారంభం చేసిన టీమిండియా.. రెండో టెస్ట్‌కు సిద్దమైంది. శుక్రవారం నుంచి అడిలైడ్ వేదికగా ప్రారంభంకానున్న డే/నైట్ టెస్ట్‌లో ఆతిథ్య ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. వ్యక్తిగత కారణాలతో తొలి టెస్ట్‌కు దూరమైన రోహిత్ శర్మ పింక్ బాల్ మ్యాచ్‌తోనే రీఎంట్రీ ఇవ్వనున్నాడు. రోహిత్ శర్మ గైర్హాజరీలో కేఎల్ రాహుల్ ఓపెనర్‌గా సత్తా చాటాడు. అద్భుతమైన బ్యాటింగ్‌తో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే రోహిత్ రాకతో ఓపెనర్ ఎవరా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఈ మ్యాచ్ నేపథ్యంలో గురువారం మీడియాతో మాట్లాడిన రోహిత్ శర్మ.. ఓపెనింగ్ స్లాట్‌పై క్లారిటీ ఇచ్చాడు. 'కేఎల్ రాహులే ఓపెనింగ్ చేస్తాడు. నేను మిడిలార్డర్‌లో ఏదొక స్థానంలో బ్యాటింగ్ చేస్తా. బ్యాటర్‌గా ఇది నాకు కష్టమే. కానీ జట్టుకు ఇదే బెస్ట్ ఆప్షన్. ఎలాంటి నిర్ణయమైనా జట్టు విజయం కోసమే తీసుకుంటాం. తొలి టెస్ట్‌లో యశస్వి జైస్వాల్-కేఎల్ రాహుల్ అద్భుతంగా ఆడారు. నా కొడుకును ఎత్తుకొని మరి వారి బ్యాటింగ్ చూశాను. రాహుల్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. అందుకే బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేయాల్సిన అవసరం లేదనిపించింది. భవిష్యత్తు గురించి ఇప్పుడే చెప్పలేం. పరిస్థితులను బట్టి మార్పులు ఉంటాయి. ఓవర్‌సీస్‌లో కేఎల్ రాహుల్‌కు మంచి రికార్డ్ ఉంది. జట్టులో కొనసాగేందుకు అతను పూర్తి అర్హుడు. తొలి టెస్ట్‌లో భారత్ విజయం సాధించడంలో రాహుల్ కీలక పాత్ర పోషించాడు. యశస్వి జైస్వాల్‌తో కలిసి డబుల్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పాడు. పెర్త్ వంటి వికెట్‌పై నిలకడగా ఆడటం సులువైన పనికాదు. టీమ్ కాంబినేషన్‌ను మార్చాల్సిన అవసరం లేదనిపించింది. కెప్టెన్‌గా నేను ఏ నిర్ణయం తీసుకున్నా అది జట్టు విజయానికి ఉపయోగపడాలి.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో టీమిండియా 295 పరుగుల తేడాతో ఆసీస్‌ను ఓడించి 1-0తో ఆధిక్యంలో నిలిచింది. తన సతీమణి రితికా సజ్దే ప్రసవ సమయంలో ఆమె పక్కనే ఉండేందుకు రోహిత్.. ఈ మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడు. నవంబర్ 15న రోహిత్ శర్మకు రెండో సంతానంగా కొడుకు పుట్టాడు. అతనికి అహాన్ అని పేరు పెట్టారు. శుక్రవారం మొదలయ్యే పింక్ బాల్ టెస్ట్‌లోనూ తొలి టెస్ట్ విజయ జోరును కొనసాగించాలని టీమిండియా భావిస్తోంది. భారత కాలమాన ప్రకారం ఈ మ్యాచ్ ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కానుంది.






# సునీల్ గవాస్కర్ ఓ జోకర్..

## ట్రావిస్ హెడ్ సంచలన వ్యాఖ్యలు

టీమిండియా దిగ్గజం సునీల్ గవాస్కర్‌ను ఉద్దేశించి ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. సునీల్ గవాస్కర్ ఓ జోకర్‌లా మాట్లాడుతున్నాడని విమర్శించాడు. ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో శుభారంభం చేసిన టీమిండియా.. రెండో టెస్ట్‌కు సిద్దమైంది. శుక్రవారం నుంచి అడిలైడ్ వేదికగా జరిగే పింక్ బాల్ టెస్ట్‌లో భారత్, ఆసీస్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌ను ఉద్దేశించి గవాస్కర్.. ఓ పత్రికకు రాసిన కాలమ్ వివాదాస్పదమైంది. రెండో టెస్ట్‌కు ఆస్ట్రేలియా స్టార్ పేసర్ జోష్ హాజెల్ వుడ్ దూరమవుతున్నాడని గవాస్కర్ పేర్కొన్నాడు. తొలి టెస్ట్ పరాజయంతో ఆసీస్ జట్టులో భయం అలుముకుందని ఈ కాలమ్‌లో ప్రస్తావించాడు. 'తొలి టెస్ట్ ఓటమితో ఆసీస్ జట్టు భయం అలుము కుంది. అందుకే ఆ జట్టు మేనేజ్‌మెంట్ కొందరి సీనియర్లపై వేటు వేసింది. తొలి టెస్ట్ మూడో రోజు హాజెల్ వుడ్ మాట్లాడిన మాటలతోనే అతన్ని జట్టులో నుంచి తప్పించనున్నారు. బౌలర్లు ఏం చేయ-ంలేరని, బ్యాటర్లే ఆసీస్‌ను రక్షించాలని అతను అ న్నాడు. ఆ వ్యాఖ్యలతో ఆ జట్టులోని సమస్యలు స్పష్టంగా కనిపించాయి. ఈ క్రమంలోనే అతను రెండో టెస్ట్ తుది జట్టులో చోటు కోల్పోయాడు. వాస్తవానికి హాజెల్ వుడ్ చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి తప్పు లేదు. గతంలో టీమిండియా కూడా ఇలానే ఉండేది. ఇప్పుడు ఆసీస్‌లో అలా జరుగుతోంది.'అని పేర్కొన్నాడు. అయితే సన్నీ వ్యాఖ్యలపై ఆసీస్ స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ ఓ పాడ్‌కాస్ట్‌లో స్పందించాడు. సునీల్ గవాస్కర్ కామెంట్స్ చాలా హాస్యాస్పదంగా ఉన్నాయన్నాడు. సునీల్ గవాస్కర్ ఓ జోకర్‌లానే మాట్లాడుతున్నాడని వ్యాఖ్యానించాడు. అతని వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నాడు. 'సునీల్ గవాస్కర్ ఇప్పుడు వినోద పరిశ్రమలో ఉన్నారని కొన్ని జట్లు అంటున్నాయి. ప్రస్తుతం ఆయన కామెంట్రీ ప్యానెల్‌లో సభ్యుడు. అలాంటి వ్యాఖ్యలను ఆయనకు వినోదాన్నిస్తే.. అదే కొనసాగించమనండి'అని పేర్కొన్నాడు. సునీల్ గవాస్కర్ కామెంట్స్‌పై ఆసీస్ మాజీ ఆటగాళ్లు కూడా విమర్శలు గుప్పించారు.

# చరిత్ర సృష్టించిన బరోడా జట్టు

## టీ20 క్రికెట్‌లో సంచలన రికార్డ్ నమోదు
## 20 ఓవర్లలో 349 రన్స్‌తో రికార్డు



బరోడా జట్టు చరిత్ర సృష్టించింది. టీ20 క్రికెట్‌లో సంచలన రికార్డ్ నమోదు చేసింది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌టైమ్ రికార్డ్ స్కోర్ నమోదు చేసింది. ఇండోర్ వేదికగా గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బరోడా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 349 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. టీ20 క్రికెట్ చరిత్రలోనే ఇది అత్యధిక స్కోర్. బరోడా జట్టులో భాను పనియా(51 బంతుల్లో 5 ఫోర్లు, 15 సిక్సర్లతో 134 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగగా.. అభిమన్యు సింగ్ రాజ్‌పుత్(17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 53), శివాలిక్ శర్మ(17 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లతో 55), విష్ణు సోలంకి(16 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లతో 50) హాఫ్ సెంచరీలు బాదారు. ఈ మ్యాచ్‌లో బరోడా బ్యాటర్లు ఏకంగా 37 సిక్సర్లు బాదారు. టీ20 ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన జట్టుగానూ బరోడా చరిత్ర సృష్టించింది. సిక్కిం బౌలర్లలో టమంగ్, రోషన్ కుమార్ రెండేసి వికెట్లు తీయగా.. తరుణ్ శర్మకు ఓ వికెట్ దక్కింది. అనంతరం సిక్కిం నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 86 పరుగులే చేసి ఘోర పరాజయాన్ని చవిచూసింది. బరోడా బౌలర్లలో నినద్ రత్వా, మహేష్ పితియా రెండేసి వికెట్లు తీయగా.. కృనాల్ పాండ్యా, అతిత్ షేత్, అభిమన్యు సింగ్ రాజ్‌పుత్ తలో వికెట్ తీసారు. సిక్కిం బౌలర్ రోషన్ కుమార్ చెత్త రికార్డ్ నమోదు చేశాడు. టీ20 క్రికెట్‌లోనే అత్యధిక పరుగులు సమర్పించుకున్న బౌలర్‌గా చెత్త రికార్డ్ తన పేరిట లిఖించుకున్నాడు. అతను నాలుగో ఓవర్లు వేసి 81 పరుగులు సమర్పించుకున్నాడు. ఈ క్రమంలో అతను మోహిత్ శర్మ రికార్డ్‌ను అధిగమించాడు. ఐపీఎల్ 2024లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున మోహిత్ శర్మ 4 ఓవర్లు బౌలింగ్ చేసి 73 పరుగులు సమర్పించుకున్నాడు.

# జూనియర్ ఆసియాకప్ హాకీ టోర్నీలో ఛాంపియన్‌గా భారత్

- ఫైనల్లో 5-3 తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ చిత్తు
- వరుసగా మూడో టైటిల్‌ను కైవసం చేసుకున్న భారత్



జూనియర్ ఆసియాకప్ హాకీ టోర్నీలో భారత్ ఛాంపియన్‌గా నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్లో భారత్ 5-3 తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో వరుసగా మూడో టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఓవరాల్‌గా భారత్‌కు ఇది ఐదో టైటిల్. గతంలో భారత్ 2004, 2008, 2015, 2023లో విజేతగా నిలిచింది. భారత్ తరఫున అర్జిత్ నాలుగు గోల్స్(4వ నిమిషం, 18వ, 47వ, 54వ నిమిషం)తో సత్తా చాటగా.. దిల్ రాజ్ సింగ్(19వ) ఓ గోల్ కొట్టాడు. పాకిస్థాన్ తరఫున సుఫియాన్(30వ నిమిషం, 39వ నిమిషం) రెండు గోల్స్ నమోదు చేయగా.. హనన్ షాహిత్(3వ నిమిషం) ఓ గోల్ నమోదు చేశాడు. పాకిస్థా-న్‌తో జరిగిన ఫైనల్లో ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఆట ప్రారంభమైన మూడో నిమిషంలోనే పాకిస్థాన్ గోల్ నమోదు చేసి దూకుడు కనబర్చింది. అయితే నిమిషం వ్యవధిలోనే ఆర్జీత్ భారత్‌కు గోల్ అందించాడు. దాంతో స్కోర్లు సమమయ్యాయి. ఇరు జట్లు తీవ్రంగా ప్రయత్నించినా.. ఫస్ట్ క్వార్టర్‌లో మరో గోల్ నమోదు కాలేదు. రెండో క్వార్టర్ ఆరంభంలోనే ఆర్జీత్ సింగ్ మరో గోల్ కొట్టగా.. నిమిషం వ్యవధిలోనే దిల్‌రాజ్ సింగ్ మరో గోల్‌తో భారత్ ఆధిక్యాన్ని డబుల్ చేశాడు. రెండో క్వార్టర్ చివర్లో సుఫియాన్ గోల్ నమోదు చేయడంతో ఫస్టాఫ్ ముగిసే సరికి భారత్ 3-2తో ఆధిక్యంలో నిలిచింది. సెకండాఫ్‌లోనూ ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. బంతిని పూర్తిగా తమ ఆధీనంలో ఉంచుకునేందుకు ప్రయత్నించాయి. ఈ క్రమంలో సుఫియాన్ 39వ నిమిషంలో గోల్ నమోదు చేసి స్కోర్లను సమం చేశాడు. దాంతో మ్యాచ్ మరింత ఉత్కంఠగా మారింది. చివరి క్వార్టర్ ఆరంభంలోనే ఆర్జీత్ సింగ్ గోల్ కొట్టి భారత్‌ను ఆధిక్యంలో నిలిపాడు. మరో ఏడు నిమిషాల వ్యవధిలో మరో గోల్ కొట్టి విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. ఆట చివరి 6 నిమిషాల్లో గోల్ కోసం పాకిస్థాన్ ప్రయత్నించినా సాధ్యం కాలేదు.

# సీజన్-11లో తెలుగు టైటాన్స్‌కు మరో ఓటమి



ప్రో కబడ్డీ ప్రీమియర్ లీగ్(పీకేఎల్) సీజన్-11లో తెలుగు టైటాన్స్‌కు మరో ఓటమి ఎదురైంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 33-36తో యూపీ యోధాస్ చేతిలో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్ ఆరంభం నుంచి అసాధారణ ప్రదర్శన కనబర్చిన తెలుగు టైటాన్స్ కీలక సమయంలో చేత-ంలెత్తేసి ఓటమికి తల వంచింది. ఆరంభంలో దూకుడుగా ఆడిన తెలుగు టైటాన్స్ ఫస్టాఫ్ ముగిసే సమయానికి 17-10తో ఆధిక్యంలో నిలిచింది. రైడింగ్, ట్యాక్లింగ్‌లో సత్తా చాటి యూపీ యోధాస్‌ను ఒకసారి ఆలౌట్ కూడా చేసింది.కండాఫ్‌లో జూలు విధిల్చిన యూపీ యోధాస్ దూకుడుగా ఆడింది. వరుస పాయింట్లతో తెలుగు టైటాన్స్‌ను ఆలౌట్ చేసి ఆధిక్యంలో దూసుకెళ్లింది. మధ్యలో తెలుగు టైటాన్స్ పుంజుకొని యూపీ యోధాస్‌ను ఆలౌట్ చేయడంతో స్కోర్లు సమమ-య్యాయి. మ్యాచ్ టైగా ముగుస్తుందని అంతా అనుకున్నారు. కానీ చివర్లో యూపీ యోధాస్ వరుస పాయింట్లతో పై చేయి సాధించడంతో పాటు విజయలాంఛనాన్ని పూర్తి చేసింది. యూపీ తరఫున సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ గగన్ గౌడ(15)తో పాటు భవానీ రాజ్‌పుత్(6) సత్తా చాటారు. తెలుగు టైటాన్స్ కెప్టెన్ విజయ్ మాలిక్(11), మంజీత్(7) రాణించినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం తెలుగు టైటాన్స్ పాయింట్స్ టేబుల్‌లో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఇప్పటి వరకు 16 మ్యాచ్‌లు ఆడిన తెలుగు టైటాన్స్ 9 విజయాలు సాధించి ఏడింటిలో ఓటమిపాలైంది. మరోవైపు యూపీ యోధాస్ 15 మ్యాచ్‌ల్లో 8 విజయాలు, ఒక టైతో ఐదో స్థానంలో నిలిచింది. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 39-32 తేడాతో హర్యానా స్టీలర్స్‌ను ఓడించింది. బెంగాల్ తరఫున మనీందర్ సింగ్(11), ప్రణయ్ రానే(6), మయూర్ కదమ్(5) రాణించారు. హర్యానా తరఫున వినయ్(10), శివమ్ పటారే(8) రాణించినా ఫలితం లేకపోయింది. ఆరంభం నుంచి ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. దాంతో ఫస్టాఫ్ ముగిసే సరికి 17-17తో సమంగా నిలిచాయి. సెకండాఫ్‌లో దుమ్మురేపిన బెంగాల్.. హర్యానాను ఆలౌట్ చేసి పై చేయి సాధించింది.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657